సుడిగుండంలో సుందరాంగి!

సుజనశ్రీ

మద్రాసు ఎయిర్ పోర్టు, మీనంబాకంనుంచి విమానం రన్ వేలో పరుగెత్తి గాలిలోకి లేచింది.

కిటికీ ప్రక్క సీట్లో కూర్చున్న సునీత దూరంగా సముద్రంలో బొమ్మలాగ కనబడే స్టీమర్లవంక చూస్తూండి పోయింది.

ఆమె ఒంటరిగా ప్రయాణించడం ఇదే మొదటిసారి. లోగడ చాలాసార్లు విమానం యెక్కింది. అయితే ప్రతి సారీ ఆమెవెంట తల్లిదండ్రు లిద్దరూ వున్నారు. ఇప్పుడు తనొక్కతే బయలుదేరింది.

సునీత తండ్రి రాజేశ్వరరావు లక్షాధికారి. మద్రాసులో పెద్ద గుడ్డలషాపు వున్నది. ఎలక్ట్రికల్ సామాన్లమ్మే మరో

దుకాణం వుంది. ఇవిగాక మరికొన్ని పెద్ద పెద్ద కంపెనీల్లో షేర్లు వున్నాయ్ ఆయనకు. రెండు మేడలు, మూడు కార్లు వున్నయ్. ముగ్గురు మగపిల్లలూ, ఒకే ఒక ఆడపిల్ల సునీత వారి సంతానం.

సునీత కాలేజీలో బి. య్యే. ఫైనల్ ఇయర్ చదువుతోంది. కలం స్నేహితులంటే ఆమెకు ఎంతో ఉత్సాహం. దేశీ, విదేశీ కలం స్నేహితులతో ఆమె ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతూండేది.

అలాంటి కలం స్నేహితురాండ్రలో ఉష ఒకామె. ఆమె తండ్రి రేణిగుంటలో ఎయిర్ లైన్స్‌లో పని చేస్తుండేవాడు. చాలారోజుల ఉత్తర ప్రత్యుత్తరాల అనంతరం ఉష ఆమెను తమ ఊరు రమ్మనీ, అక్కడనుంచి తిరుపతి వెళ్ళి శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని, ఇంకా చుట్టుపట్ల వున్న అనేక పుణ్యక్షేత్రాలు చూడవచ్చనీ ఆహ్వానించింది.

నిజానికి ఆ ఉత్తరం వచ్చిన చాలా నెలల వరకూ సునీత ప్రయాణమవటానికి వీల్లేకపోయింది. ఆమె తల్లి దండ్రులకు ఆమెను ఒంటరిగా పంపటం ఇష్టంలేక పోవటమే దీనికి కారణం. కాని సునీత పదే పదే ఒత్తిడి చేయటం వలన వాళ్ళు చివరకు అంగీకరించారు.

బస్‌లోగానీ, రైల్లోగానీ, లేదా విమానంలో నయినా సరే అతిగా వాగకూడదనీ, తనో పెద్ద లక్షాధికారి కుమార్తెనని చుట్టూ వున్నవాళ్ళకు తెలిసేలా అహంభావంగా ప్రవర్తించవద్దనీ ఆమె తల్లి బోధ చేసింది. ఈ ప్రపంచంలో అనేక రకాల వ్యక్తులు - మంచివాళ్ళూ, దొంగలూ, హంతకులూ వుంటారనీ, దుర్మార్గుల దృష్టిలో తను పడకుండా వుండాలంటే, వీలైనంతవరకూ మితభాషిగాను, ఎవరితోనూ కలవకుండా వుండటమే మేలని

ఆమె తల్లి ఉవాచ.

కిటికీలోంచి క్రిందకు చూస్తూ, బొమ్మరిళ్ళలాగున్న ఇళ్ళను చూస్తున్నదేగాని, నిజానికి ఆమె ఉషని గురించే ఆలోచిస్తున్నది.

తనీ ఫ్లైట్‌కి వస్తున్నానని ఆమెకు ముందుగానే తెలియజేసింది తను. ఆమెగూడ తన తండ్రిని వెంటబెట్టుకుని విమానాశ్రయానికి తనను రిసీవ్ చేసుకోవటానికి వస్తానని వ్రాసింది.

ఉత్తరాలద్వారా ఒకరి అభిరుచుల్ని మరొకరు తెలుసుకుని ఆ తర్వాత వ్యక్తిగతంగా కలుసుకోవటం అదో సరదాగా వుంటుంది.

ఉష తనను ఆదరంతో ఆహ్వానిస్తుందనీ, వుత్తరాల్లో వ్రాసినంత చలాకీగా మాట్లాడుతుందనీ ఊహించుకుంటోంది సునీత. అలాగనుక వాస్తవంగా లేదో, తనకు బోర్ కొట్టి చచ్చిపోవాల్సిందే అనుకుంది.

ఎయిర్ హోస్టెస్ కంఠం ఎనౌన్సర్‌లో వినబడింది. విమానం పంక్చువల్‌గా రేణిగుంట చేరబోతోందనీ, అక్కడికి దగ్గరలోనే హిందువులకు అతిపవిత్రమైన కళ్యాణ వెంకటేశ్వరుడు విచ్చేసిన పుణ్యక్షేత్రం వుందనీ చెప్పింది. ఆ తర్వాత సీటు బెల్ట్స్ కట్టుకోవలసిందని చెప్పడం విని సునీత సీట్ బెల్టుని తన నడుముచుట్టూ బిగించుకుంది.

ఆమె ప్రక్క సీట్లో కూర్చున్న మరో వయసు మళ్ళిన వ్యక్తి సీటుబెల్టు తగిలించుకోకుండా అలానే కూర్చున్నాడు. పైగా సునీతవంక చూసి "విమానం ఎక్కడం ఇదే కొత్తా?" అని అడిగాడు నవ్వుతూ.

సునీత బదులివ్వకుండా అలాగే వుండిపోయింది.

విమానం రేణిగుంట విమానాశ్రయంలో దిగుతూండగా సునీత అనుకుంది మనసులో, నాకోసం ఉష ఎయిరో

డ్రోమ్‌కి వస్తుందో రాదో, ఆమె రాకపోతే నేనేం చేయాలి, ప్లేన్ దిగీ దిగంగానే తనామెను గుర్తు పట్టగలదో లేదో అని అనుమానించింది. ఉష ఫోటో తన దగ్గరుంది. తన ఫోటోను ఉషకి పంపింది. వాటి సాయంతో ఒకరినొకరు తేలిగ్గా గుర్తించుకోవచ్చు అనుకుంది మళ్ళీ.

ప్లేన్ నుంచి దిగుతూనే దూరంగా గేటు వెంబడే బారులు తీరివున్న జనంవంక చూసింది.

ఎవరో అమ్మాయి తనవంకే చేయి వూపుతూండడం గమనించింది. ఆమె హృదయం ఆనందంతో వురకలు వేసింది. సందేహంలేదు! ఆమే ఉష.

గేటుదాటి లాంజ్ లోకి అడుగు పెట్టంగానే ఉషవచ్చి ఆమెను కౌగలించుకుంది.

"ఫోటోలోకన్న ఎంతో అందంగా వున్నదే!" ఎవరిదో కంఠం వినిపించి సునీత అటుచూసింది.

"నాతోపాటు మా అమ్మా, నాన్న, మా బావ వచ్చారు నిన్ను రిసీవ్ చేసుకునేందుకు. నీవు రాసే వుత్తరాలు మా నాన్న అభిమానాన్ని చూరగొన్నయ్. అంత బాగా రాసే అమ్మాయిని ముఖాముఖి చూడాలని ఆయన ఆరాటం!" అంటూ సునీతకు వారిని పరిచయం చేసింది.

"నీరాక మాకు చాలా ఆనందాన్ని కలిగించిందమ్మా!" అన్నాడు ఉష తండ్రి నీలకంఠం.

"థాంక్స్ సార్!" సునీత ఆనందంగా అంది. "నేను ఇదివరలోనే వచ్చి వుండాల్సింది. ఏదీ మా నాన్నగారు ఒక పట్టాన నాకు పర్మిషన్ ఇవ్వలేదు!"

"పిల్లలంటే అలా వుండాలి! అందం, ఐశ్వర్యంవున్నా తల్లిదండ్రులమాట పాటించే వినయంగూడ వుండాలి పిల్లలకు" ఉష తల్లి కమలాదేవి తన కూతురివంక చూస్తూ అంది.

"ఆమె ఇంటికి ఫోన్ చేస్తుందేమో కనుక్కోండి!" ఉష బావ కరుణాకరం నిదానంగా అన్నాడు.

"అవునమ్మా! నీవు క్షేమంగా చేరినట్లు వాళ్ళకు తెలియ జేస్తే మంచిది. లేకపోతే నీ గురించి వాళ్ళు గాభరా పడ తారేమో!"

ఎయిర్‌పోర్ట్‌నుంచి మద్రాసుకు ట్రంక్ కాల్ చేసి మాట్లాడింది సునీత.

"అమ్మా! సునీతా! సురక్షితంగా చేరావా తల్లీ!" సునీత తల్లి కాంతం అడిగింది.

"క్షేమంగానే చేరానమ్మా! ఉష, ఆమె తల్లిదండ్రులూ నన్ను రిసీవ్ చేసుకోను వచ్చారు ఎయిర్‌పోర్టుకు!"

"అలాగా! రేణిగుంటలో వారి ఇల్లుచేరాక ఒక ఉత్తరం గూడ వ్రాసిపడేయ్. వాళ్ళనేం అల్లరి పెట్టక ఈ రెండు మూడు రోజులూ జాగ్రత్తగా మసలుకో! వాళ్ళందర్నీ అడిగానని చెప్పు!"

"అలాగేనమ్మా! ఇక వుంటాను!" అంటూ ఫోన్ పెట్టే సింది సునీత.

"ఇక్కడనుంచి మనిల్లు యెంతదూరమండీ!"

"ఉంటుంది మూడుమైళ్ళు! కానీ ఈ విషయం నీకు చెప్పడానికి చాల విచారంగావుంది! ఇక్కడికి పదిమైళ్ళ దూరంలో తొండవాడ అనే గ్రామంలో మా అమ్మ జబ్బుగా వున్నదని కబురు వచ్చింది. మేం నిన్ననే అక్క డకు వెళ్లాల్సిన వాళ్ళం. కాని నీ రాకగురించి ఆగిపోయాం. మనం నేరుగా ఇప్పుడు మా అమ్మని చూడటానికి వెడు తున్నాం. అక్కడ రెండురోజులుండి, మళ్ళీ మన ఊరు వచ్చేద్దాం!"

"అయ్యో! అలాగాండి! నేను రాకుండా ఆగిపోయినా బాగుండేదేమో! మిమ్మల్ని చాల ఇబ్బందిలో పడేసి

నట్టున్నాను!'' అంది సునీత నొచ్చుకుంటూ.

"ఫర్వాలేదులేమ్మా! ఒక్కొక్కప్పుడు అన్ని అవస రాలు అలా కలిసొస్తుంటయ్. మనం చేయగలిగేది ఏమీ ఉండదు, అటువంటప్పుడు!'' అన్నాడు నీలకంఠం.

"ఇక బయలుదేరుదామా?'' అని అడిగాడు కరుణా కరం లగేజిలోంచి సునీత బ్రీఫ్ కేసుల్ని పికప్ చేసి తెచ్చి.

"పోనీ రాత్రికి తిరుగు ప్లేన్ వుందేమో కనుక్కొని వెళ్ళిపోతాను! లేదా ఏదన్నా హోటల్లో ఈ రాత్రికి వుండిపోయి తెల్లారిన తర్వాత ఫ్లైట్ కన్నా తిరిగి మద్రాసు చేరతాను!''

"అబ్బెబ్బె! ఎందుకండీ! మా ఉష మీ రాకకోసం చాలకాలంనుంచి ఎదురుచూస్తోంది. మీ కలయికను వృధా పుచ్చటం మా కెవరికీ ఇష్టంలేదు!''అన్నాడు కరుణాకరం.

"ఆమె తల్లి వయోవృద్ధురాలు!వృద్ధాప్యంవల్ల ఆరోగ్యం సరిగా వుండదు. అప్పుడప్పుడు ఆమె కిది పరిపాటే! అంతగా అవసరమైతే ఆమెను అమెరికన్ హాస్పటల్లో చేర్పించి, మనం తిరిగి రేణిగుంటకు వచ్చేయచ్చు రెండు రోజుల్లో!'' నీలకంఠం ఆమెను వారించాడు.

కమలాదేవి తల్లి చావుబ్రతుకుల్లో వుంది. తనుగూడ ఇప్పుడే వచ్చి దిగింది. తనంటే ఎంత అభిమానం వుండక పోతే వాళ్ళంతా తనకోసం విమానాశ్రయానికి వచ్చి రిసీవ్ చేసుకుంటారు! కనీసం ఆ అభిమానం గురించైనా వాళ్ళను చిన్నబుచ్చటం మంచిది కాదనిపించింది ఆమెకు.

వెనక్కు తిరిగి వెళ్ళిపోతానని మరోసారి అంది సునీత.

వాళ్ళందరూ ఏకగ్రీవంగా ఆమె అంత పని చేయటానికి ససేమిరా వీల్లేదని వారించారు. సునీత చేసేదేమీ లేక వాళ్ళతో బయలుదేరింది.

సునీత, ఉష, ఉష తల్లీదండ్రీ, ఆమె బావ అందరూ

కారులో కూర్చున్నారు. కారు బయలుదేరింది.

తారు రోడ్డుమీద నున్నగా సాగిపోతోంది కారు. రోడ్డు కిరువైపుల ఎర్ర నేల బీళ్ళూ, దూరంగా సినిమాలో సెట్టింగ్ లా పచ్చగా ఎర్రగా కనుపించే కొండలూ తప్ప మరేం కనుపించలేదు సునీతకు. అక్కడక్కడా పాడుబడి పోయిన బ్యారెన్ బిల్డింగ్ లూ, నీళ్ళు లేని చెరువుకట్టలూ గూడ ప్రత్యక్షమయినయ్.

"వచ్చే సెంటర్ లో ఆపు మామయ్యా!" అన్నాడు కరుణాకరం.

"ఓ! నీకు వచ్చేవారమే కదూ కాలేజీలో పరీక్షలు! బాగా చదువుతున్నావా?" నీలకంఠం అడిగాడు.

"బాగానే చదువుతున్నాను!" అన్నాడు కరుణాకరం.

"బావ ఎంత బాగా చదువుతున్నా డనుకున్నావ్!" అంది ఉష కళ్ళు త్రిప్పుకుంటూ.

ఆమె మాటల్లో అదోరకమైన ఈసడింపు ప్రతిధ్వనించింది.

"నువ్వేం సిఫార్సు చేయనక్కర్లేదులే!" కరుణాకరం ఉష వంక చిలిపిగా చూస్తూ అన్నాడు.

తారు రోడ్డుమీదనుంచి మలుపు తిరిగి డొంక రోడ్డు మీద కారు ఆగింది.

కరుణాకరం కారులోంచి దిగాడు.

"మీ బావ మనతో రావటం లేదా ఏం?" సునీత అడిగింది.

"లేదండీ! ఇవాళ కాలేజీ వుంది. రేపు ఆదివారంనాడు కలుస్తాను" అంటూ కరుణాకరం బయలు చెప్పాడు.

"ఇదిగో కరుణాకరం! మా ఆఫీసులో మా అసిస్టెంట్ వుంటాడు. నేను అవతల పేషెంట్ ప్రమాద పరిస్థితుల్లో వుంటే చూడటానికి వెళ్ళానని అతగాడికి కబురు చెబు

తావు కదూ!" నీలకంఠం అడిగాడు.

"అలాగే మామయ్యా! మీ డైరెక్టర్‌తోగూడ చెబుతానులే! తొందరపడి తిరిగి రాకుండా, ముసిలావిడకి నెమ్మదించేదాకా వుండి తర్వాతనే రండి!"

"ఆ విషయం నీవు చెప్పాలటరా!"

కరుణాకరం రోడ్డు కవతలగా నిలబడ్డాడు. కారు ముందుకు సాగింది.

"ఆంధ్రప్రభ వీక్లీలో సీరియల్ గురించి మన వుత్తరాల్లో చర్చించుకున్నాం గదూ? వాటిగురించి నీతో ముఖాముఖి మాట్లాడాలని ఆ వుత్తరాలు గూడా తెచ్చాను" అంది సునీత.

ఉష ఆదోలా ముఖం పెట్టింది. "ఓ! అదా! ఆ సీరియల్ రానురాను ఒట్టి చెత్తక్రింద తయారవుతోంది. అందుకే తర్వాత చదవటం మానేశాను!" అంది.

"అదేమిటి? సీరియల్ రానురాను ఎంతో ఇంటరెస్టింగ్ గా వుంటే, బాగాలేదంటూ వేమిటి!"

"ఏమో నాకు నచ్చలేదు! అంతే!" అంది ఉష.

ఉత్తరాల్లో ఎంతో సౌమ్యంగా, వినయంగా రాసే ఉషేనా ఈమె అనుకుంది సునీత.

ఉష కనుపించగానే తనతో వసపిట్టలాగే వాగేస్తుందని ఆశించిన సునీతకు చాలా ఆశాభంగం కలిగింది. తను పది అడిగినా ముభావంగా జవాబు చెబుతున్నది. ఈమెకు తను రావటం ఇష్టంలేదా? పైగా తన వంక ఈర్ష్యగా చూస్తున్నది.

"మా ముసలమ్మకు జబ్బుచేయకుండా వుంటే నేనూ మా బావతో వెళ్ళాల్సినదాన్ని!" అంది ఉష.

ముసలిది మంచాన పడటం వలన తన ప్రేమ ప్రయాణం వాయిదా పడిందని ఉషకి విచారంగా వుంది కాబోలు,

లేకపోతే తనతో ఇంకా కలుపుగోలుతనంగా వుండేది అనుకుంది సునీత.

"అలాగా!" అంది నవ్వుతూ సునీత.

"మా అమ్మకు తన తల్లి అంటే ఎంత అభిమానమో చెప్పలేం అనుకో. ఆవిడ అసలు తల్లి కాదు. సవతి తల్లి. అయితేనేం, ఆమె మా అమ్మను ప్రేమగా చూసి వుంటుందేమో, ఆమెకు ఏదన్నా కాస్త బాధ కలిగితే మా అమ్మ విలవిల్లాడిపోతుంది."

"వెనకటి వాళ్ళ ప్రేమలు అలాగే వుండేవి!"

"కాని ఆమెను చూస్తే నాకుమాత్రం భలే మంట అనుకో. ఆమెదగ్గర బోలెడంత డబ్బు వుండాలి! కాని పిసినారి. తనుగూడ సరిగా తిండి తినదు. ఆమె ఇల్లు నీవే చూద్దువుగాని! భూతాల కొంప అనుకో! ఆ పాడబడ్డ ఇల్లు కాస్త రిపేరు అన్నా చేయించదు. కనీసం సున్నం కొట్టించిన పాపాన పోలేదు" ఉష చెప్పుకుపోతోంది.

"అలా అనకు! వెనకటివాళ్ళు ఎంతో కష్టపడి సంపాదించి దాన్ని కూడబెట్టి వుంటారు. మనం ఖర్చుపెట్టినంత దుబారాగా వాళ్ళు డబ్బు ఖర్చుబెట్టలేరు. ఖర్చుచేయబోయే ప్రతి పైసాకు ప్రాణం తీసుకుంటారు!" సునీత పెద్ద ఆరిందాలా అన్నది.

"బాగా చెప్పావమ్మా!" అని మెచ్చుకుంది కమలాదేవి.

తల్లి వంక కొరకొర చూసింది ఉష. "ఫాళ్ళమ్మని అన్నానని ఎంత వుక్రోషమో చూశావా? ఆ ముసలావిడ ఎంత పిసినారో నీవే చూస్తావుగా. ఆమె తాలుకు డబ్బు యాభైవేల రూపాయలు ఇంట్లో ఎక్కడో దాచిపెట్టిందట. ఇంట్లో వున్న ఫర్నిచర్ మొత్తం అమ్ముకుంది; తనకు జరగటం లేదని! నీ కళ్ళతో నీవే చూద్దువు, ఇల్లు ఎంత బోసి పోతున్నదో ఫర్నిచర్ అదీ లేకపోవటం మూలాన్నా!"

"పాపం! డబ్బంటే ఆమెకు అంత ప్రాణం అన్న మాట!" సానుభూతిగా అంది సునీత.

2

కారు చిన్నపల్లె దాటి మైలుదూరం వచ్చింది. చీకటి పడడం మూలాన, కారు హెడ్ లైట్ వెలుగులో కనబడే రోడ్డు మినహా మరేం కనిపించడం లేదు. చుట్టూ కమ్ముకున్న చీకటిలో సుదూరంగా అక్కడక్కడా ఒకటీ రెండు దీపాలు మిణుకు మిణుకు మంటూ కనిపించీ కనుపించకుండా ఉన్నాయ్.

"మీ అమ్మమ్మ తన ఇల్లు ఊరికి దూరంగా కట్టుకుందేమిటి?" సునీత అడిగింది.

"ఇది ఆమె తాతలకాలం నాటిది. అప్పుడే యింటి చుట్టూ పొలాలు వుండేవి. క్రమేపీ వానలు పడక, రైతులందరూ ఈ భూముల్ని బీడు పెట్టేసారు. మా అమ్మ గత మూడు నెలలుగా అమెరికన్ హాస్పిటల్లో ట్రీట్మెంట్ తీసుకుంది. తనింకా ఎక్కువకాలం బ్రతకనేమో అని భయం. తన ప్రాణం తన స్వంత యింట్లో పోవాలని ఆమె కోరిక. అందుకే హాస్పిటల్ నుంచి యింటికి తెచ్చేదాకా ఒకటే పోరు పెట్టిందనుకో!'! కమలాదేవి నిదానంగా చెప్పింది.

"పాపం!" అంటూ సానుభూతి చూపింది సునీత.

కారు లైట్ల వెలుగులో రెండంతస్తుల పాత మేడ కనుపించింది సునీతకు. దాన్ని చూస్తుంటే, ఆమెకు సినిమాల్లో చూపే దయ్యాల మేడలు గుర్తుకు వచ్చినయ్. ఈ మేడగూడా వాటికి తీసిపోదు అనుకుంది. మేడ గోడలనుంచి సున్నపు పెళ్ళలు విరిగి పడిపోయి ఉన్నయ్. సున్నం కొట్టి ఎన్నేళ్ళు అవుతుందో, గోడలు నల్లబడి ఉన్నయ్.

ఇంటిచుట్టూ పొదలూ, తీగెలూ దట్టంగా పెరిగి ఉన్నాయ్. లాన్‌లో గడ్డిని ఈ మధ్యనే కత్తిరించినట్టుగా కనుపించినా, దుబ్బలు దుబ్బలుగా గడ్డి పెరిగింది. ఆ యింటికి మైలుదూరం లోపల ఎక్కడా ఇల్లు అనేది లేదు.

మేడకు ఒకప్రక్క గ్యారేజ్ వుంది.

ఆ దృశ్యానికి తగ్గట్టుగానే ఆ యింట్లో దీపాలు ఏడుస్తూ వున్నాయ్. ప్రతిగదికీ మెర్క్యురీ లైట్లు పెడితే కొంచెంగా యింటికి శోభ వచ్చేది. కాని ఆ యింటిలో భీభత్స వాతావరణానికి సాయపడేందుకే అన్నట్టుగా నలభై క్యాండిల్స్ బల్బులు మందకొడిగా వెలుగుతున్నయ్.

కారు దిగి వెనుక డోర్ తెరిచాడు నీలకంఠం.

లోపల్నుంచి ఒక పనిమనిషి బయటకు పరుగెత్తుకు వచ్చింది.

"హమ్మయ్య! వచ్చారా అమ్మగారూ! ఆ పెద్దామెతో వేగలేక ఛస్తున్నాను!" అంది ఆమె, డిక్కీనుంచి లగేజ్ అందుకుంటూ.

"మీరు అమ్మాయిని లోపలకు తీసుకురండి. నేను అమ్మకెలా వుందో చూసి వస్తాను!" అంటూ కమలాదేవి లోపలకు నడిచింది ఆత్రంగా.

నీలకంఠం సునీత, ఉషలు తన వెనుకే రాగా యింట్లోకి వెళ్ళాడు. క్రింది భాగంలో అటు రెండుగదులూ, ఇటూ రెండుగదులూ, మధ్యలో పెద్ద హాలు వున్నది.

హాల్లో పాతబడ్డ కుర్చీలు అయిదున్నయ్. వాటి మధ్యగా గుండ్రటి స్టూలు వుంది.

ఆ ఫర్నిచర్‌ని చూస్తూనే ఉష చెప్పినట్టుగా, ముసలిది చాలా పిసినారి అయివుంటుంది అని అనుకుంది సునీత.

కుడివేపుగా వున్న గదుల్లో ఒకటి సునీతకు కేటాయించబడింది. ఆమె గదిలో మంచం, పరుపూ, టేబుల్ కి బిగించబడిన అద్దం వున్నయ్.

మిగతా గదుల్లో మాత్రం ఫర్నిచర్ కూడా లేదు.

“ఈ గది మా అమ్మమ్మది. ఆమె వయసులో వున్నప్పుడు దీన్నే వాడుకున్నదట. మళ్ళీ ఆ గదిని వుపయోగించే అదృష్టం నీకు కలిగింది” అన్నది ఉష, సునీత వంక చూస్తూ.

సూట్ కేస్ తెరచి తన గుడ్డలను కొన్నిటిని తీసి బయట పడేసింది సునీత.

అంతలో పనిమనిషి వచ్చింది. “అమ్మగారికి వేన్నీళ్ళు కాచాను. స్నానం చేద్దురు కాని రండి!” అంది సునీత నుద్దేశించి.

విమాన ప్రయాణం ఎంతో సుఖంగా సాగినా, చాలా సేపు పట్టిన కారు ప్రయాణంతో సునీత డస్సిపోయింది.

వేడినీళ్ళ స్నానం తరువాత ఆమె బడలిక కొంచెం తగ్గింది.

నీలకంఠం కారు గ్యారేజీలో పెట్టి దానికి తాళం వేసి లోపలకు వచ్చాడు.

“పాపం! ఆ అమ్మాయి ప్రొద్దుననంగా తిన్నదేమో భోజనం! త్వరగా వడ్డించమను మీ అమ్మతో” అన్నాడు ఉషతో.

“వంట అంతా రాములు చేసే వుంచింది నాన్నా!” ఉష సమాధానం విని నీలకంఠం కుర్చీలో జారగిలబడి, ట్రాన్సిస్టర్ రేడియోని ఆన్ చేశాడు.

సునీత తన దుస్తులు మార్చుకుని హాల్లోకి వచ్చేసరికి కమలాదేవి మేడమెట్లు దిగుతూ కనుపించింది.

“ఎలా వుందండి మీ అమ్మగారికి?” సునీత అడిగింది.

"ఇప్పుడే నిద్రపుచ్చి వస్తున్నానమ్మా! ఉషా! పని మనిషి రాముల్ని వడ్డించమను త్వరగా!"

హాలు తర్వాత వంటగది, ప్రక్కనే వరండా వుంది. అక్కడో పాతపడిన టేబుల్ వుంది. రాములు టేబుల్ చుట్టూ కుర్చీలు వేసి భోజనం వడ్డించింది.

"మమ్మీకి స్లీపింగ్ టాబ్లెట్స్ అయిపోయాయి. రేపు టౌన్ కి వెళ్ళి పట్టుకురండి, మర్చిపోకుండా! అలాగే డాక్టర్ నరసింహంగార్ని గూడ వెంట తీసుకురండి. మరో సారి ఆమెను ఎగ్జామిన్ చేయిద్దాం!" కమలాదేవి భర్తనుద్దేశించి అన్నది.

"ఇవాల్టికన్నా వున్నాయా స్లీపింగ్ పిల్స్! లేకపోతే ఈ రాత్రంతా నానాగోల చేసి యింటిని ఒక కొలిక్కి తెస్తుంది!" నీలకంఠం ఆదుర్దాగా అడిగాడు.

"ఈ రాత్రికి సరిపడా వున్నయ్ లెండి!"

"పాపం! ఈ పాడుబడ్డ కొంపలో సునీతను ఇబ్బంది పెట్టాల్సి వచ్చింది!" కమలాదేవి నొచ్చుకుంది.

"ఫర్వాలేదు లెండి! నా గురించి మీరేం శ్రమపడద్దు. ఆమె బాగోగులు చూడండి ముందు!"

కిటికీలోంచి నల్లటిపిల్లి "మ్యావ్!" అంటూ క్రిందకు దూకి వంటగదిలోకి పరుగెత్తింది.

"అది మీ పెంపుడు పిల్లా?" సునీత అడిగింది.

"ఛీ! కాదు! ఎక్కడిదో వచ్చినట్టుంది. నాకూ మా అమ్మకూ పిల్లులంటే అసహ్యం! రాములమ్మా! వంట యింట్లోకి పిల్లి దూరింది. దాన్ని తరిమెయ్!" కమలాదేవి అసహ్యంగా అరిచింది.

సునీతకు పిల్లులన్నా, కుక్కపిల్లలన్నా ఎంతో యిష్టం. ఆ పిల్లిని తన ఒళ్ళోకి తీసుకుని దాని తల నిమురుదామనుకున్నది. కాని ఇక్కడ వీళ్ళకెవరికీ పిల్లిని చూస్తే

పడదు కాబోలు అనుకుని తన ప్రయత్నాన్ని విరమించుకుంది.

భోజనాలయాక నీలకంఠం, ఉష, కమలాదేవి హాల్లో కూర్చుని ఆ రోజు పేపర్లోని విషయాల గురించి పిచ్చాపాటీ మాట్లాడుకోసాగారు. సునీత తనకు నిద్రవస్తున్నదని అందరికీ 'గుడ్ నైట్' చెప్పి తన గదిలోకి వెళ్ళింది. తలుపులు మూయబోతూండగా మేడమీదనుంచి కీచుగొంతుతో పెద్దగా కేక వినిపించింది, సునీత గుండెలవిసిపోయేలా.

"ఏమేవ్ కమలా! యెక్కడ చచ్చావే! త్వరగా రావే! నా ప్రాణం పోతోందే!"

మంచంలో తీసుకుంటున్న ముసలమ్మ అరుపు కాబోలు అనుకుంది సునీత, తలుపులు మూయకుండా అలాగే ఆగిపోయి.

కమలాదేవి గాభరాగా కుర్చీలోంచి లేచి మెట్లకేసి పరుగెత్తింది.

"చచ్చాం ఫో! ఇక ఈవిడ అరుపులతో మనం నిద్రపోయినట్టే!" ఉష విసుగ్గా అంది.

సునీతకు ఒంటరిగా గదిలో పడుకోవటానికి భయం వేసింది. పడుకునే ప్రయత్నం విరమించుకుని, ఆమెగూడ హాల్లోకి వచ్చి కుర్చీలో కూర్చుంది.

పదినిముషాలు గడిచాక కమలాదేవి కొయ్యతో చేసిన మెట్లమీదనుంచి దిగి వచ్చింది.

"ఇక ఫర్వాలేదు. మిగిలిపోయిన స్లీపింగ్ టాబ్లెట్స్ అన్నీ మందులో కలిపి త్రాగించాను. తెల్లారేదాకా లేవదు" కమలాదేవి అనునయంగా చెప్పింది.

కాసేపు న్యూస్ పేపర్ తిరగేసి మళ్ళీ తన గదికి చేరుకుంది సునీత. తలుపు గడియపెట్టి, బెడ్ మీద వాలిపోయింది.

ఒక క్షణం క్రితం అలసటగా ఫీలయిన సునీత నిరాశతో నిట్టూర్చింది. ఆమెకు నిద్రరావటంలేదు. తను ఎంతో సరదాగా, తన కలం స్నేహితురాలితో గడుపుదామనుకుని వచ్చింది. కాని ఇక్కడ మరో విచారకరమైన దృశ్యం యెదురయింది.

బెడ్ మీద అసహనంగా అటూ యిటూ పొర్లింది. కనీసం ఉష బావ అన్నా వుంటే కొంత కాలక్షేపం జరిగేదేమో! కమలాదేవి యెప్పుడూ వంటపనిలోనో, లేక తన తల్లికి సేవచేస్తూనో వుంటుంది. నీలకంఠం అ సమానమూ ఏవో పుస్తకం చదువుకుంటూనో లేక చెట్లకు పాదులు తీయటమో చేస్తూ వుంటాడు.

తను యెన్నో కబుర్లు చెప్పి అంతకు రెట్టింపు కబుర్లు ఉష నోటినుంచి విందామని తను ఆశిస్తే, ఉష మాటలు రాని మొద్దులా, అ సమానమూ తనకేసి అదోలా చూడటం తప్పితే, తన అమ్మమ్మను సాధించటం మినహా తనతో మాట్లాడనే మాట్లాడదాయె!

మరునాడు శనివారం అన్న సంగతి అప్పుడు గుర్తుకు వచ్చింది సునీతకు. శనివారంనాడు, వుదయమే తలారా స్నానంచేసి గుడికి వెళ్ళి రావటం ఆమె అలవాటు.

రేపు ఏదన్నా గుడికి వెళ్దామనుకున్నా గానీ, ఈ ఇల్లు నాగరిక ప్రపంచానికి సుదూరంగావుంది. మరి, చేరువలో ఏదైనా దేవాలయం వుందో లేదో! రేపు కమలాదేవిని అడగాలి. ఒకవేళ దగ్గరలో ఏదీ లేకపోతే కొంచెం దూరమయినా, కారు వేసుకుని వెళ్ళి తీరాలి. తనకు డ్రయివింగు వచ్చుగనుక, తనొక్కర్తే అయినా వెళ్ళి రాగలదు అనుకుంది.

ఆలోచనల్లోనే ఆమె నిద్రలోకి జారుకుంది.

3

బాగా పొద్దు ఎక్కాక సునీత నిద్ర లేచింది. దొడ్లోకి వెళ్లి బావి దగ్గర ముఖం కడుక్కుంది.

"ఏమండీ! ఇవాళ శనివారం! నేను తలనిండా స్నానం చేసి యేదైనా గుడికి వెళ్లాల్సివుంది. ఈ చుట్టుపట్ల యేదైనా గుడి వుందా?" అని కమలాదేవిని అడిగింది సునీత.

"గుడికి వెళ్లాలా? దగ్గరలో యేదీ లేదమ్మా! నాలుగు మైళ్ళు వెడితే మరో గ్రామం వస్తుంది. అక్కడ రామాలయం వుంది. కాని మీరు అంతదూరం యెలా వెళ్ళగలరు?"

"దానిదేముందండి! కాలున్నదిగదా! నాకు డ్రయివింగు వచ్చు. నేనూ ఉష కలసి వెళ్తొస్తాం!"

కమలాదేవి ఒక నిముషం ఆలోచించింది. "మరేం లేదమ్మా! ఈ పల్లెటూళ్ళలో వుండే మగపిల్లలు ఒట్టిరౌడీ వెధవలు. ఒంటరిగా ఆడది, అందునా బస్తీ అమ్మాయి కనిపిస్తే అల్లరి చేస్తారు. అదీ నా భయం!"

"మీరు ఆ విషయంలో నిశ్చింతగా వుండండి. నేను త్వరగా స్నానంచేసి వస్తాను. ఉషనుగూడ రెడీ అవమనండి!"

"అదా! తొమ్మిదయినా దానికి తెల్లారదు. అది లేచి స్నానం చేసి ముస్తాబయేసరికి పొద్దు వాలిపోతుంది గూడాను."

"ఉష విషయం నాకు వదిలేయండి పిన్నిగారూ! దాన్ని నిద్ర లేపి తీసుకువెళ్లే పూచీ నాది!"

"సరేనమ్మా! ఏదో పెద్దదాన్ని నాభయం వెల్లడించాను. ఆపైన మీ ఇష్టం!"

సునీత వుషారుగా ఉష గదిలోకి వెళ్ళింది. ఎంతో శ్రమపడ్డమీదటగాని ఉష లేవలేదు. తను వెళ్లి స్నానం

చేసివచ్చి, ఉషని రెడీ చేసేసరికి సునీతకు తలప్రాణం తోకకు వచ్చింది.

అనుక్షణమూ యేదో సాకుచెపుతూ సునీత ప్రయాణాన్ని వాయిదా వెయ్యాలని చూసింది కమలాదేవి. కాని సునీత ప్రతి వంకకు సరైన సమాధానం చెప్పి, ఆమె అభ్యంతరాల్ని త్రోసిపుచ్చింది. నీలకంఠం తను గూడ వాళ్ళతో వస్తానన్నాడు.

"మీ కెందుకండీ శ్రమ! నేనూ, ఉష యిద్దరం వెళ్ళి వస్తాములెండి" అంది సునీత.

నీలకంఠం స్వతహా మెతక మనిషి. మరో మాట చెప్పకుండా కారుతాళాలు ఆమెచేతి కిచ్చాడు.

కారు కదిలిపోయింది. వాళ్ళు వెళ్ళిపోయాక కమలాదేవి భర్తమీద ఇంత యెత్తున లేచింది.

"మీరన్నా వాళ్ళని ఆపగూడదూ? సమయానికి వాడు గూడ లేడు! అమ్మాయి క్షేమంగా వెనక్కి తిరిగి వచ్చేదాకా ప్రాణాలు ప్రాణాల్లో వుండవు."

"మహంకాళిలాగ నామీద యెగరకపోతే, వాళ్ళని నువ్వే ఆపలేకపోయావ్!" నీలకంఠం నిదానంగా అన్నాడు.

"కారు చెడిపోయిందనో, టైర్లలో గాలి లేదనో చెపితే సరిపోయేది కదా!"

"ఆ మాత్రం తెలివి నాకేడిస్తే, యిన్నేళ్ళు నీతో కాపరం చేసేవాడ్నా!"

"ఇప్పుడు మాత్రమేం? ఈపని పూర్తికాగానే ఎవరి వాటా వాళ్ళు పుచ్చుకుని విడిపోదాం!" అంది కమలాదేవి.

"అంతా సాఫీగా జరగాలికదా? ఎక్కడన్నా కథ అడ్డం తిరిగిందంటే అందరం జైలులో కూర్చుంటాం!"

"చాల్లే! నోర్ముయ్! శుభం పలకరా పెళ్ళికొడకా

అంటే పెళ్ళికూతురు ముందేది అన్నాట్ట వెనకటికి నీలాంటి వాడే!''

వాకిట్లో మోటారుసైకిలు వచ్చిన శబ్దం వినిపించింది.

''కరుణాకరం వచ్చినట్టున్నాడు!'' అన్నాడు నీలకంఠం.

ఇద్దరూ మౌనంగా, భయంగా, బిక్కు బిక్కుమంటూ వాకిలివంక చూస్తూ వుండిపోయారు.

బూట్లు టకటక శబ్దం చేసుకుంటూ కరుణాకరం లోపలకు వచ్చాడు.

''ప్రతిమల్లాగు అలా కూర్చున్నారేం? సునీత ఏదీ? ఆమె కేమన్నా అయిందా?'' అనడిగాడు ఆదుర్దాగా.

''అదేం లేదులే!'' అన్నాడు నీలకంఠం.

''మరింకేమిటి?''

''సునీత రామాపురం గుడికి వెళ్లొస్తానని వెళ్ళింది, ఉపతో!'' అన్నది కమలాదేవి.

కరుణాకరం ముఖం కోపంతో జేవురించింది.

''మీ కేమన్నా బుద్ధి వుందా అని? ఆ అమ్మాయిని బైటికి ఎలా పంపించారు? ఇప్పుడేదన్నా కథ అడ్డం తిరిగితే మన పని ఏమవుతుంది?'' అంటూ చిందులు త్రొక్కాడు.

''ఏం చేయను చెప్పు! అప్పటికీ నేను ఒకటికి పదిసార్లు అభ్యంతర పెట్టాను. కాదని ఆమె వెళ్ళింది. అయినా రామాపురం వేపు మనల్ని తెలిసిన వాళ్ళెవరూ లేరులే!''

''అదుగో! ఆమాటే అనొద్దంటాను! ఆ డబ్బేదో మన చేతికి వచ్చేదాకా మనం అనుక్షణం అప్రమత్తగా వుండాలి అని నేను తల పగులకొట్టుకున్నా గాని మీ మట్టి బుర్రలకు అర్థం అయి ఏడవదు!''

కమలాదేవి లోపల్నుంచి కాఫీ తెచ్చింది.

"ఇదెవరికి కావాలి? సీసా పట్రా!" అన్నాడు కరుణాకరం కర్కశంగా.

"ఇప్పుడా? ఆ అమ్మాయి తిరిగి వస్తే ఇంకేమన్నా వుందా? మన నిజస్వరూపం తెలిసిపోదూ?" కమలాదేవి భయంగా అంది.

"నువ్వు నోరు మూసుకుని చెప్పింది చెయ్యి!"

కమలాదేవి లోపలకు వెళ్ళి విస్కీ సీసా తెచ్చింది. దాన్ని అందుకుని కార్కు పీకివేసి అందులోని ద్రవాన్ని గ్లాసులోకి వంచుకున్నాడు కరుణాకరం.

"ఒరేయ్ అల్లుడూ! నాకూ కూడా కొంచెం! నిన్నటి నుంచినాలుక పీక్కుపోతోంది!" అని విలవిల్లాడాడు నీల కంఠం.

సీసాలో అడుగున కొంత మిగిల్చి నీలకంఠానికి అందించాడు కరుణాకరం. గ్లాసుఎత్తి గటగట త్రాగేశాడు తర్వాత.

దూరంనుంచి కారు హారన్ వినబడింది.

"అమ్మాయి వస్తున్నట్టుంది" అన్నది కమలాదేవి.

"ఈ సీసాలూ, గ్లాసులూ అన్నీ మాయంచేసెయ్! ఊఁ త్వరగా!" అన్నాడు కరుణాకరం.

కమలాదేవి వాటిని లోపల దాచేసి, టేబుల్ని శుభ్రంగా తుడిచింది.

కారు గేటులోంచి లోపలకు వచ్చి, గుమ్మం ముందు ఆగింది.

కరుణాకరం ఒక్క అంగలో కారుదగ్గరికి దూకాడు.

"ఉష్; ఆమెకి తెలీకపోతే నీకన్నా బుద్ధి వుండక్కర్లా?" అంటూ ఉష పీక పుచ్చుకున్నాడు కరుణాకరం.

అతడి వాలకాన్ని చూసి సునీతకూడ భయపడి

పోయింది, అయినా తమాయించుకొని అంది.

"ఆమెదేం తప్పులేదండీ! నేనే బలవంతంచేసి తీసుకెళ్ళాను. శనివారం తప్పనిసరిగా గుడికి వెళ్ళే అలవాటు నాకు."

కమలాదేవి అడ్డుకుంది కరుణాకరాన్ని.

"అప్పటికీ నేను చెప్పాను గూడా! ఇక్కడ పల్లెల్లో అందరూ రౌడీ వెధవలుంటారు! వద్దని చెప్పాను!" అంది.

"ఆ! అవునవును! నిజమే! ఇక్కడి పల్లెల్లో త్రాగుబోతు రౌడీ లెక్కువ" అన్నాడు కరుణాకరం తనని సంబాళించుకుంటూ.

"దోవలో మీ కెవరూ అడ్డు తగల్లేదు కదా!" అనడిగింది కమలాదేవి ఉషవంక చూస్తూ.

"లేదమ్మా! ఎవరూ మా వంక కన్నెత్తి చూడలేదు!" అని సమాధాన మిచ్చింది ఉష.

కమలాదేవి ఆత్రం చూసి సునీత తనలో తనే నవ్వుకుంది, తామేం మరీ చిన్నపిల్లలా, మాయచేసి యెత్తుకుపోవడానికి.

"ఇప్పుడు పోతే పోయావ్! ఇంకెప్పుడూ నేనుగానీ, మామయ్యగానీ తోడు లేకుండా వెళ్ళకండి!" కరుణాకరం నిదానంగా అన్నాడు.

"ఆ ముసలి పీనుగ ఎప్పుడు చస్తుందోగానీ, ఈ కొంపలో మరో నాలుగురోజులుంటే నాకు పిచ్చెక్కేలాగుంది!" తనలో తను అనుకున్నట్టుగా పైకే అనేసింది ఉష.

"నీకేం పొయ్యేకాలమే ఆ ముసలావిడమీద పడి ఏడుస్తావ్! నువ్వన్నా చెప్పు సునీతా! ఆమె నాలుగుకాలాలపాటు బ్రతకాలనే గదా మా ఈ ప్రయత్నమంతా!

ఇంతకుముందే డాక్టరుగారు చూసి వెళ్ళారు. ఆమె పరిస్థితి కొంత మెరుగయిందనే చెప్పారు కూడాను" కమలాదేవి దీనంగా అంది.

సునీతకు ఈ వ్యవహారం ఏమీ మనసుకు నచ్చలేదు. తను రావడమే పెద్ద డిసప్పాయింట్ మెంట్! తను ఎంతో కులాసాగా కబుర్లతో గడపాలనుకున్న సమయం ఇలా వృధా అయిపోతున్నదని ఆమెకు బాధగా వుంది.

4

భోజనాల దగ్గర సునీతకు సరికొత్త అనుమానం వచ్చింది. తను వచ్చినప్పట్నుంచి ఆ ముసలమ్మకు ఎటువంటి ఆహారం ఇచ్చినట్లు లేదు. ఏ ఆధరవూ లేకుండా ఆమె ఎలా వుండగలుగుతోంది?

"ఏమండీ! మీ అమ్మగార్కి ఏ ఆహారమూ ఇచ్చినట్లు లేదే!" అని కమలాదేవిని అడిగేసింది. తీరా అడిగాక ఎందుకడిగానా అని నొచ్చుకుంది, తన ప్రశ్న కమలాదేవిని కష్టపెట్టేలా చేయవచ్చు అని.

కమలాదేవి సునీత వేసిన ప్రశ్నకు తడబడింది. కంగారుగా సునీత వంక చూసింది. సునీతకు ఏం బదులు చెప్పాలో తికమకపడి తన భర్త నీలకంఠం వంక చూసింది.

"ఓ! అదా! రెండు రోజుల్నుంచి ఆమె సరిగా స్పృహలో వుండటంలేదు. అందుకే డాక్టరుగారు ఇవాళ పొద్దున్నే గ్లూకోస్ ఇంజెక్షన్ ఇచ్చారు. రాత్రినుంచి వ్యాం జావ ఇవ్వమన్నారు!" నీలకంఠం జవాబు విని కమలాదేవి తేరుకుని "అవునవును! రాత్రికి జావ ఇవ్వమన్నారు. ఓవల్టిన్ గూడ పట్టమన్నారు కదూ! నాకు మరోసారి గుర్తుచేయండి, మరిచిపోతానేమో!"

మధ్యాహ్నం ఉషని అడిగింది సునీత. "మీ అమ్మమ్మ నోసారి చూడాలని వుంది. పైకి పోదామా?"

"ఆవిడ దగ్గరకా! నాకు భయం! ఆ గది వాతావరణ మంటేనే నాకు ఒళ్ళు గగుర్పాటు కలిగిస్తుంది. అయినా ఆ మతిలేని ముండని చూసేదేమిటి లేద్దూ!" అని తేలికగా కొట్టిపారేసింది ఉష.

ఆ మాటలు విన్న కమలాదేవి తను కల్పించుకుని జవాబిచ్చింది, "అవేం మాటలు! మనసున్న వ్యక్తి కెవరికయినా, ఇంట్లో జబ్బుతో వున్న మనిషిని చూడాలనీ, రెండు మంచి మాటలు చెప్పి ఓదార్చాలనీ అనిపిస్తుంది. అలాగే చూద్దువులే సునీతా! రాత్రికి ఆమె తెలివిగా వున్నప్పుడు తీసుకెళతాను!"

సునీత సరేనన్నట్టు తలూపింది. ఉష వైఖరి చూస్తుంటే ఆమెకు ఒళ్ళు మండుతోంది. కనీసం తనమాటన్నా విలువ లేకుండా చూస్తోంది! ఆమెకన్నా ఆమె తల్లిదండ్రులే తన మాటను గౌరవిస్తున్నారు.

రాత్రయేసరికి ముసలమ్మను తను చూడాలన్న విషయమే మరిచిపోయింది సునీత.

కమలాదేవి తన తల్లికి ట్రేలో ఓవల్టిన్, ఇంకేదో తీసుకువెళ్తుండగా ఆమెకు మళ్ళీ రోగిని చూద్దామన్న ఊహ వచ్చింది.

కమలాదేవి ఆమెకు ఆహారం ఇవ్వటం అయిపోయాక అడుగుదామనుకుంది. కాని కమలాదేవే పిలిచింది ఈతడవ.

"సునీత! నీవుగూడా నాతో రా! మా అమ్మను చూద్దువుగాని!"

సునీత ఆమె వెనుకనే చెక్క మెట్లు ఎక్కి పైకి వెళ్ళింది. నల్లబడిపోయి నీళ్ళోడుతున్న గోడల్ని చూస్తుంటే ముందుకు పోవటానికి సునీతకే అసహ్యం వేస్తోంది. తనకు

బుద్ధితక్కువై పైకి వచ్చావ్రా బాబూ అనుకుని మనసులోనే చెంపలేసుకుంది.

అంత పాతమేడలో గూడ చిన్న టేబుల్, దానిమీద టెలిఫోన్ వుండటం సునీతకు ఆశ్చర్యం కలిగించింది.

ఇల్లు నీట్ గా వుంచుకోవాలంటే డబ్బు ఖర్చవుతుందని కొంపను ఈ రకంగా తయారుచేసుకున్న పిసినారి ముసలమ్మ టెలిఫోన్ని ఎలా భరించటానికి ఒప్పుకుందో.

ఒకవేళ ఎమర్జన్సీ అయితే డాక్టర్ని పిలవటానికి ఫోన్ ఏర్పాటుచేసి వుంటారు వీళ్ళే, ఆమెకు తెలియకుండా.

"నువ్వు ఇక్కడే వుండు. ఆమె స్పృహలో వుంటే లోపలకు వద్దువుగాని!" అంటూ కమలాదేవి గది తలుపు నెట్టుకుని లోపలకు వెళ్ళింది. తన వెనుకనే తలుపులు మూసి లోపల గడియపెట్టింది.

సునీత బయటనే నిలబడిపోయింది. పై అంతస్తు అయినాగాని రాక్షసి గుహలోలాగా చీకటిగా వుంది ఆ ప్రదేశం. వెలుతురు రావడానికి ఆస్కారం లేకుండా వుంది.

ఇలాంటి వాతావరణంలో మంచివాళ్ళకు గూడ రోగం వస్తుంది. అటువంటిది ఆ రోగి ఇక్కడ ఎలా కోలుకుంటుందని వీళ్ళు అభిప్రాయపడుతున్నారో అని విస్తుపోసాగింది.

లోపల్నుంచి సన్నగా మూల్గులూ, ఏవో సణుగుతున్న ధ్వనీ వినబడుతున్నయ్. మధ్యలో కమలాదేవి పెద్దగా మాట్లాడుతున్నది.

"నన్ను ఎందుకమ్మా ఇలా కాల్చుకు తింటావు! సరిగా ఆహారం తీసుకోక మమ్మల్ని ఇబ్బంది పెట్టి, నిన్ను నీవు కష్టపెట్టుకుంటావ్!"

తలుపు తెరుచుకుని మళ్ళీ బయటకు వచ్చింది కమలా

దేవి. తలుపు సందులోంచి లోపల్నుంచి బెడ్ కనబడు తోంది. దానిమీది మనిషిని చూడటానికి ప్రయత్నించింది గాని కమలాదేవి అడ్డం వుండటం మూలాన్ని ఎవరూ కనబడలేదు.

కమలాదేవి తన వెనుకనే తలుపులు వేసేసింది. "ఆమె మనలోకంలో లేదమ్మా! మరోసారి చూద్దువుగాని పద!" అంటూ సునీతనుంచి సమాధానం కోసం చూడకుండా మెట్లు దిగిపోసాగింది.

చేసేదిలేక సునీత ఆమె వెనకాలే నడిచింది. ఇద్దరూ మెట్లు దిగాగో, లేదా మేడపైన గదిలోంచి పెద్దగా అరుపులు వినబడినయ్.

"ఏమేవ్! కమలా! నాకు ఆకలి మండిపోతుందే! త్వరగా అన్నం పట్రావే!"

కమలాదేవి సునీత వంక చూసింది చురచురా! "చూశావా! ఇప్పుడే కదా ఆమెకు ధారకంపోసి వస్తు న్నాను. మళ్ళీ ఆకలని అరుస్తోంది. అన్నం కావాలని గోల చేస్తుంది. రోగిష్ఠిదానికి అన్నం ఎలా పెట్టం?" అన్నది.

సునీత సానుభూతిగా ట్రేలోని ఖాళీ పాత్రలవంక చూసింది.

సునీత మనసు అయోమయం అయిపోయింది. తన గదిలో బెడ్ మీద వాలిపోయింది. ఆమె ఆలోచనలన్నీ ముసలానిమీదకే పోయాయి.

వీళ్ళందరూ కావాలని ఆమెను మాడుస్తున్నారా? ఆమె త్వరగా చావాలని వీళ్ళ కోరికా?

స్పృహలేని స్థితిలో ఆమె ఇబ్బంది పెడుతున్నా, సహించి కమలాదేవి ఆమెకు సపర్యలు చేస్తోంది. తల్లి మీద ప్రేమచేతనా? లేక ఆమె ఎక్కడో నిగూఢంగా

దాచుకున్న యాభైవేల రూపాయల కోసమా? ముసలిది తన డబ్బు ఎక్కడ దాచిందీ ఇంకా చెప్పి వుండదు. ఆ డబ్బు వీళ్ళచేతికి చిక్కంగానే రోగిష్ఠిదాన్ని కైలాసానికి సాగనంపి తమ దోవంట తాము పోతారా?

అంటే వీరంతా ఆమె అంతిమక్షణాలకోసం ఎదురు చూస్తున్నారా? తలుచుకున్న కొద్దీ తన కళ్ళముందర ప్రత్యక్షంగా ఏదో నాటకం జరుగుతున్నట్టుగా ఫీలవసాగింది.

కమలాదేవిని చూస్తుంటే, తను వేసే ప్రశ్నలకు ఆమె తడబడడం గమనిస్తుంటే, ఆమె ఏదో నిగూఢ రహస్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు యత్నిస్తున్నట్టుగా అనిపించింది సునీతకు. బుర్ర ఎంతగా బద్దలు కొట్టుకున్నా ఆ రహస్యం దేనికి సంబంధించి వుంటుందో ఆమెకు అవగతం కాలేదు.

ఈ ఇంటి పరిసరాలు తన మనసుని కలుషితం చేస్తున్నవా? ఆ ప్రభావమే, ఎంతో మంచివాళ్ళయిన ఉష కుటుంబంమీద అనుమానం కలిగించేలా చేస్తున్నదా?

ముసలమ్మకు సరైన ఆహారం ఇవ్వక మాడ్చి చంపుతున్నారా? లేక ఆమె నిధి ఎక్కడ దాచి వుందో చెప్పమని చావుబ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడే ప్రాణిని ఇంకా హింసిస్తున్నారా? ఎంతగా ఆలోచించినా వాస్తవికతకూ, మిథ్యకూ మధ్య తేడాను భేదించలేకపోయింది.

ఆలోచనలతో విసిగి, అలిసిపోయి నిద్రలోకి జారుకుంది సునీత.

5

కిటికీలోంచి నీరెండ ముఖంమీద పడేసరికి సునీత కళ్ళు తెరిచింది. అప్పటికి బాగా ప్రొద్దెక్కిందనుకుని

బెడ్ మీదనుంచి లేచింది. దువ్వెనతో వెంట్రుకల్ని సరి చేసుకుంది అద్దంలో చూసుకుంటూ. ఆ తర్వాత టూత్ పేస్టూ బ్రష్ తీసుకుని దొడ్లోకి నడిచింది.

తను ఇక్కడికి వచ్చి ఇప్పటికి రెండు రోజులయింది. ఇంతవరకూ ముసలిదాని రోగం వుండేదీ, పోయేదీ తేల లేదు. ఇంకా ఎన్నాళ్ళు ఇక్కడ వుండాలో. తన పరిస్థితి చూస్తుంటే మరో రెండు మూడు రోజులకన్న ఎక్కువ వుండలేననిపిస్తోంది. ఉష చెప్పినట్టుగా ఇక్కడ చాలా రోజులు వుంటే మతిపోయేలా వుంది. పైగా ముసలి రోగి బెడ్ ప్రక్కన మరో బెడ్ వేసుకుని తనుగూడ మంచ మెక్కే పరిస్థితి గూడా రావచ్చు.

లోపల్నుంచి కమలాదేవి తన కుమార్తెను నిద్రలేపటం వినిపిస్తోంది సునీతకు.

"ఏమేవ్ ఉషా. ఏం మొద్దునిద్రే! బారెడు ఎండ ఎక్కేదాకా మెళకువ రాదేమో!" అని అరుస్తోంది కమలాదేవి.

ముసిలామె, కమలాదేవి అనురాగాలు ఎలా వున్నా గాని, కమలాదేవి ఆమె కుమార్తె ఉష ధోరణిగూడ విచిత్రంగా తోస్తున్నది సునీతకు. వాళ్ళిద్దరి మధ్య తల్లీ కూతుళ్ళ మధ్య వుండాల్సిన మమతగానీ, ఆప్యాయతగానీ లేదు. ఎవరో ముక్కు ముఖం యెరగని ఇద్దరు స్త్రీలు తమ గమ్యానికి పోతూ పోతూ దోవంట ఈ భూతాల మేడలో మజిలీ చేసినట్టుగావుంది. లేక ఉష గూడ తన తల్లిలాగ, ఏదన్నా నిగూఢ రహస్యాన్ని కాపాడుతున్నదా తననుంచి.

"మ్యావ్" అంటూ నల్లపిల్లి వచ్చి గోడమీదకూర్చుంది. ఈ పిల్లికి ముసలిదంటే ప్రేమ కాబోలు! ఈ ఇంటిని వదిలి పోవడంలేదు అనుకుంది సునీత.

ఎవరో ఆ పిల్లిమీదకు రాయి విసిరారు. రాయి తగిలి పిల్లి బాధతో అరుస్తూ పారిపోయింది. వెనక్కి తిరిగి ఆ రాయి విసిరిందెవరా అని చూసింది సునీత.

అక్కడ కరుణాకరం నిల్చుని వున్నాడు.

"ఆ రాయి పిల్లికి సరిగా తగిలితే అది ఈపాటికి చచ్చి పోయి వుండేది!" అన్నది సునీత.

"అది చావాలనే రాయి విసిరాను. గురి తప్పి అది బ్రతికిపోయింది" అన్నాడు కరుణాకరం కసిగా.

"పిల్లిని చంపితే మహాపాపం! బంగారు గుడి కట్టించినా ఆ పాపం పోదట!"

"అదేమో నాకు తెలీదు. కాని పిల్లులంటే నాకు తగని కోపం!"

రేడియోలో వస్తున్న తెలుగున్యూస్ అయిపోయింది. ట్రాన్సిస్టర్ ఆపేస్తూ అడిగాడు నీలకంఠం. "మీా అమ్మకు ఓవల్టిన్ కలిపి ఇచ్చావా?"

అతడి కేక ఇల్లంతా మారుమ్రోగింది. మరుక్షణంలో కమలాదేవి జవాబుగూడ వినిపించింది పెద్దగా. "ఇదో వెడుతున్నా!"

ఆ తర్వాత చెక్క మెట్లమీాద అడుగుల చప్పుడు వినిపించింది. అదేమిటో మునలమ్మ గదివేపునుంచి ఏమాత్రం అలికిడి వినిపించినా సునీత చెవులు రిక్కించి వింటోంది.

ముఖం కడుక్కోవటం ముగించి లోపలకు వచ్చింది సునీత.

గ్లాసుతో వేడివేడి కాఫీ తెచ్చి అందించింది ఉష. సునీత గ్లాసు అందుకుంటూ అడిగింది "మీా పనిమనిషి కనబడదేం!" అని.

"సరేలే! ఎందుకడుగుతావ్! ఈ కొంపలో మేంగనుక వుండగలుగుతున్నాం. ఇక్కడ పనిచేయాలంటే పనిమను

ష్యలు యెవరూ నాలుగురోజులన్నా పనిచేయరు. మేం రాగానే దానిదోవన అది జారుకుంది.''

''ఉషా! ఏమిటా పెడసరం మాటలు!'' నీలకంఠం కోప్పడ్డాడు.

సునీత అతనివంక చూసింది. మళ్ళీ అంతలోనే సునీతను చూసి నవ్వాడు అతడు. అతడి ముఖంలో దాచుకుంటున్న గాంభీర్యం, పైకి నటనతో అతడూ ఏదో కప్పిపెడుతున్నట్టుగా తోచింది, కమలాదేవి, ఉషల్లాగే. బహుశా ఆ యాభై వేల రూపాయలమీదే అతడి ఆశల్నిగూడ నిల్పుకున్నాడేమో అనుకుంది.

''ఉషా! నీవూ, కరుణాకరం ఊళ్ళోకి వెళ్ళి అమ్మమ్మకు కావాల్సిన మందులు తెస్తారా?'' కమలాదేవి అడిగింది.

''నేనుగూడ వెళ్తానండీ! నాకు అలా గాలి పీల్చుకున్నట్టుగా వుంటుంది!'' అన్నది సునీత.

కమలాదేవి నీలకంఠం వంకా, కరుణాకరం వంకా, చూసింది. నీలకంఠం తల అడ్డంగా ఊపాడు. కాని కరుణాకరం చిరునవ్వుతో అన్నాడు, ''పోనీ రానీయ్, నేనూ వెంట వుంటానుగదా?''

మరో గంట గడిచాక ముగ్గురూ కారులో బయలు దేరారు.

పొలాలు, గుట్టలూ దాటుకుని కారు ఒక బస్తీలోకి ప్రవేశించింది. ఆ ఊరు అటు పల్లె, ఇటు టౌన్ కాకుండా వుంది. మందుల షాపులో కరుణాకరం ఏవో మందులు కొన్నాడు. తర్వాత సరుకుల దుకాణం ముందుకెళ్ళి రోజూ వాడుకకు కావాల్సిన తినుబండారాలు తీసుకోవటంలో కొంత టైమ్ పట్టింది.

ఉషగూడ కరుణాకరం వెంటే వెళ్ళింది. సునీత కారులోనే కూర్చుండిపోయింది. తన డైరీ తీసి అందులోంచి

పోస్టుకార్డు తీసింది. తను ఇంకా కమలాదేవి తల్లిదగ్గరే వున్నట్టు, రెండు రోజుల్లో రేణిగుంటలో ఉష స్వాగృహానికి పోతున్నట్టుగా ఇంటికి వుత్తరం రాసింది.

కరుణాకరం, ఉష యిద్దరూ సరుకులు మోసుకుంటూ తిరిగి వచ్చారు.

"ఇక్కడ దగ్గరలో పోస్టాఫీసు వుందా?" అని అడిగింది సునీత.

"ఏమిటి? పోస్టాఫీసా? ఏదైనా వుత్తరం వుందా పోస్టు చేయాల్సింది! మీ యింటికేనా?" కరుణాకరం తన ఆదుర్దాన్ని చిరునవ్వుతో కప్పిపుచ్చుకుంటూ అడిగాడు.

"అవును!" అంటూ పోస్టుకార్డు తీసి అందించింది సునీత.

"అన్నట్టు నాదీ ఒక లెటర్ పోస్టుచేయాలి! సమయానికి గుర్తుచేశారు మీరు!" అంటూ సునీత కార్డు అందుకుని పోబోయాడు.

"మళ్ళీ కాలినడకన ఎందుకు? కార్లోనే పోతేపోలా?" సునీత విసుగ్గా అంది.

"పోస్టాఫీసు చిన్న గొందులో వుంది. అక్కడికి కారు వెళ్ళదు. ఇప్పుడే వచ్చేస్తాను చిటికెలో!" అంటూ కరుణాకరం మలుపు తిరిగి కనుమరుగైపోయాడు.

రోడ్ ట్రాన్స్‌పోర్ట్ బస్ వచ్చి సెంటర్లో ఆగింది దుమ్ములేపుతూ. అది మద్రాసుకు వెళ్ళే బస్సే.

దాన్ని చూడంగానే సునీతకు ఇంటిమీద గాలిమళ్ళింది. తను ఒక్కసారిగా కారులోంచి దిగిపోయి ఆ బస్‌లో ఎక్కితే అనుకుంది. తన డైరీలోని పర్సులో డబ్బంతా వుంది. తను మద్రాసు చేరాక, తన బ్రీఫ్‌కేస్‌ని ఎవరిచేతనయినా పంపమని నీలకంఠానికి ఫోన్ చేయిస్తే సరిపోతుంది.

కాని, ఆమె కాళ్ళూ చేతులూ చచ్చుబడిపోయినట్టుగా ఆమె కదలలేకపోయింది. తను పిచ్చిపట్టిన దానిలా గభాల్న కారుదిగేసి వెళ్ళి బస్‌లో యెక్కితే అందరూ తననో ఫూల్ క్రింద జమ కట్టరూ! లేదా తల్లికోసం దిగులు పడే పాలుత్రాగే పసిపాపాయిక్రింద లెక్కకట్టి తనను చిన్న చూపు చూడరూ!

బస్ స్టార్టయి ముందుకు సాగిపోయింది. తనకు చేజిక్కిన అవకాశం జారిపోయింది. ఇక తను మళ్ళీ ఆ దయ్యాలమేడకు పోకతప్పదు. అక్కడింకా ఎన్నిరోజులు క్రుంగిపోవాలో ఏమో! బుద్ధి పొరపాటయి వచ్చాననుకుంది.

పెద్దపెద్ద అడుగులు వేసుకుంటూ కరుణాకరం తిరిగి వచ్చాడు. కారు డోర్ తెరుచుకుని స్టీరింగ్ ముందు కూర్చున్నాడు.

సునీత అభీష్టానికి వ్యతిరేకంగా కారు వెనక్కి తిరిగి వేగం పుంజుకుని, దయ్యాలమేడ వేపుగా దూసుకుపోతోంది.

6

ఉష వారిస్తున్నా వినకుండా తనుగూడ ఒక సంచీ మోస్తూ సరుకుల్ని లోపలకు చేర్చింది సునీత.

హాల్లో నీలకంఠం, కమలాదేవి విచారంగా కూర్చున్నారు. కొంపదీసి ఆ ముసలమ్మ 'టా' అనలేదుగదా అనుకుంది సునీత.

కానీ ఆ శుభగడియలు అంత త్వరగా వచ్చేలా లేవు.

"ఇంతక్రితమే డాక్టరుగారు వచ్చి చూసి వెళ్లారు. ముసలమ్మ ఆఖరు క్షణాల వరకూ ఆమెను కనిపెట్టుకుని వుండమనీ, ఆమె అంతిమకోర్కె లేవైనావుంటే తీర్చటానికి ప్రయత్నించమనీ చెప్పి వెళ్ళారు!" అంటూ కమలా

దేవి కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"ఊరుకో! పెద్దవాళ్ళ చావు పెళ్ళితో సమానమంటారు? ఆమెను వీలైనంత సుఖంగా వుంచటానికి ప్రయత్నించు!" అన్నాడు నీలకంఠం ఆమెను ఓదారుస్తూ.

కొద్ది క్షణాలు సునీత మౌనంగా కూర్చుండిపోయింది. "సమయంకాని సమయంలో వచ్చి నేను మీకు ఇబ్బంది కలిగిస్తున్నట్టున్నాను. ఎందుకయినా మంచిది, మధ్యాహ్నం బస్‌కి నేను వెళ్ళిపోతాను" అంది చివరకు.

కమలాదేవి కళ్ళనీళ్ళు తుడుచుకుంది. "అలా అనకు సునీతా. నీవ్రూ మా అమ్మాయిలాంటి దానివే! మా కుటుంబంలో మరో సభ్యురాలి వనుకుంటాం నిన్ను! నీవు పదే పదే వెళ్ళిపోతానంటే మా మనసు మరీ బాధపడుతుంది."

"అవునమ్మా! ఇక్కడ నీ మర్యాదకు లోటేమీ జరగ లేదుకదా? ఇంత కష్టంలోనూ నిన్ను ఎంతో ఆప్యాయంగా చూసుకోవడంలేదూ!" నీలకంఠం తాళం వేశాడు.

"అందుకోసం కాదండీ నేను చెప్పేది. నేను మీకు ఈ కష్టసమయంలో భారంగా వుంటానేమో అని అంటున్నాను. మా అమ్మా, నాన్నా నన్ను ఎంత ఆదరంగా చూస్తారో మీరూ అంత ఆప్యాయంగా చూస్తున్నారు!" సునీత నిదానంగా అంది.

"ఉషా! నీవు పెద్దమ్మను కనిపెట్టుకుని కూర్చో. నేను త్వరగా వంట పూర్తిచేస్తాను!" కమలాదేవి కుర్చీలోంచి లేచింది.

ఉష "అలాగేనమ్మా!" అంటూ మెట్లెక్కి మేడ పైకి వెళ్ళింది.

సునీతకు ఏమి చేయటానికి తోచడంలేదు. ట్రాన్సిస్టర్

ఆన్ చేసేంది. ఫారిన్ స్టేషన్లు మాత్రమే పలికినయ్. టైం కాని టైమ్‌లో లోకల్ స్టేషన్లు ఎలా వస్తయ్ అనుకొని ఆఫ్ చేసింది.

వంట ఇంటిలోకి వెళ్ళి కమలాదేవికి సాయం చేయ సాగింది. ప్లేట్లు కడగడంలోనూ, కూరలు తరగటం లోనూ సహాయపడింది.

"నీ కెందుకమ్మా శ్రమ! హాయిగా కూర్చో!" అంది కమలాదేవి.

"ఫర్వాలేదు లెండి. ఊరికే కూర్చుంటే ఏమీ తోచ టంలేదు. నాకూ పొద్దుపోయినట్టుంటుంది. ఇటు మీకూ సాయపడ్డట్టు వుంటుంది!" అంది సునీత.

కమలాదేవి సినిమా కబుర్లూ, ఆడవాళ్ళ ఫాషన్ల గురించీ చాలా విషయాలు మాట్లాడింది.

టైమ్ గడచే విషయమే తెలియకుండా కాలం గడి చింది. ప్రతిక్షణమూ ఒక యుగంలా గడుపుతున్న సునీత రాత్రయేసరికి 'అమ్మయ్య! యివాళ ఒకరోజు గడిచింది!" అనుకుంది తేలికపడ్డ హృదయంతో.

రాత్రి భోజనాలయి హాల్లో కూర్చుని కబుర్లు చెప్పు కున్నారు చాలాసేపు. కాని ఆ కబుర్లలో నీలకంఠం కుటుంబంయొక్క స్వంత విషయాలేవీ రాలేదు. అదే సునీ తకు ఆశ్చర్యాన్ని కలిగించింది. అయినా తను ఈ దయ్యాల మేడ ప్రభావానికి లోనై ప్రతిదాన్నీ ఇలా అనుమా నిస్తోంది ఏమిటా అనుకుంది.

వాచీవంక చూసుకుంది సునీత. టైమ్ పదయింది.

"మామయ్యా! ఇక నేను వెడతాను!" అన్నాడు కరుణాకరం టైమ్ చూసుకుంటూ.

"వెళ్ళివస్తాను అని చెప్పు! నేను చెప్పిన విషయాలు ఏవీ మర్చిపోకుండా జాగ్రత్తగా మసలుకు రావాలి!

తెలిసిందా?''

''అలాగే!'' అంటూ కరుణాకరం బయటకు వెళ్ళిపోయాడు. కారు స్టార్టయిన శబ్దం వినిపించింది.

''ఇంత రాత్రివేళ చలిలో ఎక్కడికే అంత హడావిడిగా వెళ్ళాడు?'' అనడిగింది సునీత.

''ఆయన ఆఫీసులో అర్జంటు వ్యవహారాలేవో వున్నాయట. వాటిగురించి వెళ్ళాడు. ఆయన పోదామనుకుంటే యిక్కడ మా అమ్మకు వచ్చేప్రాణం, పోయే ప్రాణంగా వుందాయె!'' కమలాదేవి సమాధానం చెప్పింది.

బయట చలిగాలి వీస్తోంది. ఆకాశం మబ్బులు కమ్ముతోంది. పెద్దగాలీ వాన వచ్చేలా వుంది.

''చలిగాలి తోలుతున్నది. తుఫాను వస్తుందేమో? ఏదైనా వేడిపానీయం త్రాగితే బాగుంటుంది. టీ కలిపి ఇస్తావా?'' నీలకంఠం అడిగాడు. అతడు కమలాదేవికి ఏదో సైగ చేయటం సునీత గమనించకపోలేదు. అయినా ఏమీ ఎరగనట్టుగా ఊరుకుంది.

రాత్రిపూట పడుకోబోయేముందు టీ త్రాగితే నిద్రాభంగం కలుగుతుంది. కాని టీ త్రాగకపోతే వీళ్ళు వూరుకునేలా లేరు అనుకుంది సునీత.

గ్లాసులో టీ తెచ్చి సునీతకు అందించింది కమలాదేవి.

''ముందు బాబాయిగారి కివ్వండి!'' అంది సునీత మర్యాదగా.

''ఇస్తాను లేమ్మా! నీవు అతిథివి. ముందు నీవు తీసుకో'' అంటూ బలవంతం చేసింది కమలాదేవి.

సునీతకు గ్లాసు అందుకోక తప్పలేదు. నీలకంఠం చేసిన సైగలోని అంతరార్థం ఏమయి వుంటుంది? తన కివ్వబోయే పానీయంలో ఏదైనా విషాన్ని కలిపి ఇస్తున్నారా? తనను చంపినందువల్ల వీళ్ళకేమిటి లాభం?

అయినా తనను అంతం చేయదల్చుకుంటే, వున్న పళాన పీక నులిమి చంపినా తనను రక్షించేందుకు ఎవరూ రారు. మరయితే బలవంతాన తనచేత టీ త్రాగించటంలో, అందులోనూ తనకు అదే గ్లాసు కేటాయించబడటంలో అంతరార్థం ఏమయి వుంటుంది?

బహుశా, చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ, జీవితకాలాన్ని పొడిగించుకుంటూ పోతున్న ముసలమ్మని బలవంతంగా రైలెక్కిస్తారేమో, యమధర్మరాజు దగ్గరకు పంపటానికి! ఆ విషయం తను గమనించకుండా వుండటానికి ఈ టీలో మత్తుమందు కలిపి యిస్తున్నారేమో!

సునీతకు అయిడియా వచ్చింది. "కాసిని మంచినీళ్ళు యిస్తారూ?" అనడిగింది.

మిగతా ముగ్గురూ_నీలకంఠం, ఉష, కమలాదేవి టీ సిప్ చేస్తున్నారు. కమలాదేవి లేవపోతూండడంగా ఆమెను వారించింది సునీత.

"మంచినీళ్ళకూజా యిక్కడే వుందిగదా! నేను నీళ్లు వంచుకుంటాను లెండి!" అంటూ లేచి, మరో ఖాళీగ్లాసు తీసుకుని కిటికీ దగ్గరకు నడిచింది సునీత. కిటికీ దగ్గరే స్టూలుమీద మంచినీళ్ల కూజా వుంది.

టీ గ్లాసుని కిటికీలో వుంచి గ్లాసులోకి నీళ్లు వంచుకు త్రాగింది. ఎవరూ తనవంక చూడటంలేదని నిర్ధారణ చేసుకుని 'టీ' గ్లాసుని కిటికీలోంచి బయటికి వంచింది. టీ అంతా పారబోసి ఆ గ్లాసు నీళ్ళతో తొలిచి అందులోకి మరి కాసినినీళ్ళు వంచుకుంది.

ఆ తర్వాత కిటికీదగ్గరే నిలబడి వాళ్ళు తనని గమనించేలా గ్లాసులోని నీళ్ళను 'సిప్' చేసింది.

"ఈ రాత్రికి పెద్దవాన వచ్చేలా వుంది!" అంది ఖాళీ గ్లాసుల్ని ట్రేలో వుంచుతూ.

"అవునవును! కరుణాకరం ఇంత రాత్రివేళ వెళ్ళాడు. తిరిగి రాగలడో, లేదో?" సానుభూతిగా అన్నాడు నీలకంఠం.

"వాన వచ్చినా, వరద వచ్చినా వాడేం వెనక్కు తగ్గే రకం కాదు!" ఉష తన బావను సమర్థిస్తూ అంది.

7

సునీత ఆవులించింది. మత్తుగా అరకన్నులు మూస్తూ "నాకు నిద్రవస్తోందండీ! వెళ్ళి పడుకుంటాను!" అంది.

కుర్చీలోంచి లేచి రెండడుగులు వేసి కుప్పగా కూలి పోయింది నేలమీద.

"మత్తుమందు అప్పుడే పనిచేసిందన్నమాట!" కమలాదేవి నవ్వుతూ అంది.

"ముందామెను ఆమె గదిలో బెడ్ మీదకు చేర్చు!" నీలకంఠం అన్నాడు కటువుగా.

కమలాదేవి సునీతను లేవదీసి భుజానవేసుకుని ఆమె గదిలోకి నడిచింది. బెడ్ మీద సునీతను పడుకోబెట్టింది. గొంతువరకు దుప్పటికప్పి "పాపం! పిచ్చిపిల్ల!" అనుకుంది పైకే.

కమలాదేవి తిరిగి హాల్లోకివచ్చి కూర్చుంది.

ఆమె వెళ్ళిపోయాక సునీత కొద్దిగా కళ్ళు తెరిచి దొంగ చాటుగా చూసింది.

గది తలుపు ఒకటి పూర్తిగా మూయబడింది. రెండో తలుపు వారగా వేసి వుంది.

ఆ సందులోంచి కుర్చీలో కూర్చున్న నీలకంఠం, అతడి ముందున్న గుండ్రటిబల్ల, దానిమీద ట్రాన్సిస్టర్, న్యూస్ పేపరూ, అతడి కెదురుగా కూర్చున్న ఉష కాళ్లు మాత్రం కనబడుతున్నాయ్ సునీతకు.

వీళ్ళకు నిద్రరాదా? లేక ఎవరికోసమన్నా నిరీక్షిస్తూ కూర్చున్నారా? బహుశా కరుణాకరం రాకకోసమేమో! అతడు వస్తే అప్పుడు మేలుకోవచ్చుగదా! అంతవరకూ జాగారం చేయటం దేనికి?

వాన ప్రారంభమయింది. ఊచలు లేని కిటికీలోంచి కొద్దికొద్దిగా జల్లు లోపలకు పడుతోంది. అయినా సునీత బెడ్ మీదనుంచి లేవలేదు, కిటికీలు మూయటానికి. అలా లేస్తే తను మత్తులోంచి తేరుకున్నట్టుగా వాళ్ళు కనుక్కుంటారు. ఏది ఏమయినా వాళ్ళ ప్లాన్ ఏమిటో ఆరా తీసేదాకా తను ఇలాగే పడుకునే వుండాలని నిశ్చయించుకుంది.

మరో గంట గడిచింది. సునీతకు ఈ భీభత్సవాతావరణంలో నిద్రపట్టటంలేదు. హాల్లో కూర్చున్న వాళ్ళనే వాచ్ చేస్తూ పడుకుంది.

రోడ్డుమీదనుంచి కారు హారన్ పెద్దగా వినిపించింది. "కరుణాకరం వచ్చినట్టున్నాడు!" అంటూ హాల్లో వున్న ముగ్గురూ లేచారు ఆత్రంగా.

ఉష ఒక్క అంగలో వెళ్ళి తలుపుతీసింది. చంకలో పెద్ద లెదర్ బ్యాగ్‌తో కరుణాకరం లోపలకు వచ్చాడు.

"ఏమయింది?" నీలకంఠం పెద్దగా అడిగాడు. ఆత్రుతలో అతని కంఠం వణికింది.

"సక్సెస్! బ్రహ్మాండమయిన సక్సెస్!" అంటూ కుర్చీల మధ్యగా వున్న చిన్న టేబుల్ మీద లెదర్ బ్యాగ్‌ని వుంచాడు.

నీలకంఠం దానిమీదకు ఎగబడి సంచీని తెరచి బాగా విడదీశాడు.

లోపల్నుంచి కరెన్సీ నోట్లకట్టలు సునీతాదేవి గదిలోకి కనుపించినయ్,

ముసలమ్మని బాధించి, వేధించి, చివరకు ఆమె తను దాచుకున్న డబ్బు గురించిన సమాచారాన్ని కక్కించి వుంటారు. ఇప్పుడు కరుణాకరం వెళ్ళి ఆ డబ్బుని వెదకి చేజిక్కించుకుని వచ్చాడల్లే వుంది.

"కిటికీలన్నీ గూడ మూసేయండి!" అని ఆజ్ఞాపించాడు కరుణాకరం.

మిగతా ముగ్గురూ ఆలోచనలేని వాళ్ళలా తలా ఒక కిటికీ దగ్గరకు పరుగెత్తి తలుపులు మూసేశారు.

"ఎంత?" కమలాదేవి అడిగింది.

"లక్ష!" కరుణాకరం జవాబిచ్చాడు.

ముసిలిదాని డబ్బు యాభై వేలు అనే చెప్పింది ఉష. కాని ఆమె నిజంగా లక్షరూపాయలు దాచిందన్నమాట అనుకుంది సునీత.

"నా జీవితంలో ఎన్నడూ ఇంత డబ్బు చూడలేదు" నీలకంఠం అన్నాడు.

"ఆ అమ్మాయిచేత మందు త్రాగించారా?" కరుణాకరం అడిగాడు.

"నీవు అలు వెళ్ళంగానే 'టీ'లో మత్తుమందు కలిపి ఇచ్చాం. దాన్ని త్రాగి ఆమె ఇక్కడ నేలమీదనే మత్తుగా వాలిపోయింది. నేనే ఆమెను ఎత్తుకుని తీసుకు వెళ్ళి బెడ్ మీద పడుకోబెట్టాను" కమలాదేవి బదులు చెప్పింది.

"గుడ్! మరో గంటదాకా ఆమె మత్తులోనుంచి తేరుకోకుండా వుంటే చాలు. మన పని తేలికగా పూర్తయిపోతుంది."

సునీత వులిక్కిపడింది. 'తేలికగా పూర్తయిపోతుందిట!' ఏమిటూ పని!

ముసలమ్మను కడతేర్చి, ఆమె డబ్బుని చేజిక్కించు

కున్న విషయం తనకొక్కదానికే తెలుసు. అయితే ఈ రహస్యం శాశ్వతంగా, బయటకు పొక్కకుండా, వుండేలా చేయాలంటే తననుగూడ కడతేరుస్తారా? తనేదో సుడి గుండంలో ఇరుక్కున్నట్లనిపించింది.

వాళ్ళంతా లక్షరూపాయల్ని చేజిక్కించుకున్న సంతోషంలో హాట్ డ్రింక్స్ త్రాగుతూ సెలిబ్రేట్ చేసుకుంటున్నారు. వాళ్ళు ఆ మైకంలోంచి తేరుకోకముందే తను ఈ భూతగృహంనుంచి పారిపోవాలి.

బయటనుంచి వీస్తున్న గాలికి గది తలుపులు రెండూ దగ్గరగాచేరి మూసుకున్నాయ్. ఇదే అదనుగా సునీత బెడ్ మీదనుంచి లేచింది. వానలో పారిపోవటానికి వీలుగా, మినీ స్కర్ట్ వేసుకుంది. హవాయ్ చెప్పుల్ని విడిచేసింది. రెయిన్ కోటు తీసుకుని తన డైరీని పాకెట్ లో దోపుకుంది.

తలగడల్ని బెడ్ మీద నిలువుగా పరిచి దానిమీద దుప్పటి కప్పింది, ఎవరన్నా గభాల్న చూసినా బెడ్ మీద మనిషి వున్నదనే అభిప్రాయపడాలని.

నెమ్మదిగా కిటికీలోకి ఎక్కి కూర్చుంది సునీత.

చుట్టూ గాఢాంధకారం. హోరుగాలితో జోరుగా కురుస్తోంది వాన. అప్పుడప్పుడు ఆకాశంలో వస్తున్న మెరుపుల వెలుగు తప్ప ఎక్కడా కనుచూపుమేరలో మినుకు మినుకుమనే గుడ్డిదీపం కాంతి కూడా కనుపించటం లేదు.

ఇంటి చుట్టూరా చాల దూరంవరకు ఖాళీ స్థలం వుంది. తను త్వరగా ఆ ఖాళీజాగాను దాటి దూరంగా కనుపించే దుబ్బుల చాటుకో, లేక మరో దిశగా కనుపించే శిధిలమైపోయిన మండపందాకా వెళ్ళే లోపున వాళ్ళు తన పరారీని గుర్తించారో తన పని ఖాళీ అనుకుంది.

8

కిటికీ తలుపుని ఒకచేత్తో పట్టుకుని క్రిందికి దూకింది సునీత. చీకట్లో ఆమె కాలి క్రింద ఏదో మెత్తగా తగిలింది. ఆమె కంగారుపడిపోయి బ్యాలెన్స్ తప్పిపడిపోయింది.

చూరు క్రిందగా నల్లపిల్లి చలికి వణుకుతూ కూర్చుంది. సునీత సరిగా దానిమీదకే దూకింది. పిల్లి బాధతో పెద్దగా "మ్యావ్" "మ్యావ్" అని అరుస్తూ పారిపోయింది.

జారిపడిపోతూ సునీత వదిలేసిన కిటికీ తలుపు బలంగా కిటికీకి కొట్టుకుంది.

అంత వానలోనూ కిటికీ తలుపు మూసుకుపోవటంవలన 'ధడాల్'మని పెద్దగా చప్పుడయింది.

హాల్లో డ్రింక్స్ సిప్ చేస్తూ సెలిబ్రేట్ చేసుకుంటున్న వ్యక్తులు ఒక్కుమ్మడిగా వులిక్కిపడ్డారు.

"ఏమిటది?" కరుణాకరం అరిచాడు.

"ఉషా! నీవు సునీత గదిలోకి వెళ్ళి చూడు! బయట ఇంకెవరన్నా వచ్చారేమో చూడవయ్యా నీవు!" అని కమలాదేవి ఇటు కుమార్తెనూ, అటు భర్తనూ పురమాయించింది.

నీలకంఠం తలుపు తెరిచి వాకిట్లో నలుమూలలా చూశాడు. ఎవరూ కనుపించలేదు. మళ్ళీ తలుపుమూసి గట్టిగా గడియ బిగించి లోపలకు వచ్చాడు "ఇక్కడెవరూ లేరే!" అంటూ.

పారిపోతూన్న సునీతకు ఉష పెద్దగా అరవటం వినిపించింది. "సునీతాదేవి గదిలో లేదు!"

"చచ్చాం! ఛో! నా గదిలో టార్చిలైట్లు పట్రండి! ఆమె ఎంతో దూరం పోయి వుండదు. నీలకంఠం! నీవు పరుగెత్తుకు వెళ్ళి రోడ్డెక్కు. ఆమె తప్పించుకోటానికి అదొకటే మార్గం!"

నీలకంఠం తలుపు తెరుచుకుని బయటకు పరుగెత్తాడు. అతడి చేతిలో టార్చి వెలుగుతున్నది.

సునీత పొలాలకు అడ్డంపడి వేగంగా పరుగెత్తసాగింది. ఇంటిలోపల్నుంచి మనుషులు బయటకు వచ్చి ఆదుర్దాగా పలికే మాటలు ఆమె చెవుల్ని తాకుతున్నయ్.

గడ్డిలోంచి గట్లమీదుగా పరుగెత్తుతోంది సునీత. అలా పరుగుదీస్తూనే ఒకసారి వెనక్కు తిరిగి చూసింది. ఇంటి నుంచి తను ఎంతో దూరం రాలేదు.

తనను వెదకటానికి బయలుదేరిన వాళ్ళ చేతుల్లో టార్చి లైట్లున్నయ్. అది తనను తేలికగా పట్టిస్తాయన్నదే ఆమె బాధ. ఒకవేళ వాళ్ళు తనకు మరీ దగ్గరైతే తను గడ్డిలో పరుండిపోతే సరి అనుకుంది.

టార్చిలైటు వెలుగు ఆమెమీద పడింది. ఆ విషయం ముందే పసిగట్టి సునీత నేలమీద పడిపోయింది.

కాని అప్పటికే సమయం మించిపోయింది. వాళ్ళు తనను చూసినట్టుగా వాళ్ళమాటల్లో తేలిపోయింది. ఇక ఇప్పుడెలా అనుకుంది. ఏమయినాసరే తను వాళ్ళ చేతికి దొరకగూడదు.

టార్చిలైట్ వెలుగు ఆరిపోంగానే ఆమె లేచి మరో దిశగా పరుగెత్తసాగింది. వాళ్ళు లైట్‌ని నేలమీద వేసుకుంటూ దారిచేసుకుని వస్తున్నారు. ఆమె పరుగెత్తుతూనే టార్చి వెలుగు ఎటు ప్రసరింపబడుతూందో గమనిస్తోంది.

గభాల్న నేలమీద పడుకుంది. ఆమెమీదుగా టార్చి వెలుగు పడి మరో దిశకు మరలింది. సునీత అలానే నేల మీదుగా ప్రాకుతూ కొంతదూరం వెళ్ళింది.

అంతలో కరుణాకరం గొంతు వినపడింది. "కారు హెడ్‌లైట్లు వెలిగించండి. ఆ కాంతిలో ఆమె ఇట్టే దొరికిపోగలదు."

నీలకంఠం కారుని స్టార్ట్ చేసి పొలాల వేపుగా మళ్ళించాడు. ఇంజెన్ ఆపుచేసి లైట్లు వెలిగించాడు.

అదృష్టవశాత్తూ సునీత కారు లైట్ల రేంజ్ కి దూరంగా వుంది.

"లాభంలేదు. ముగ్గురూ టార్చ్ లైట్లు వెలిగించి ఒకసారే అన్ని దిక్కుల్లోనూ చూడండి" కమలాదేవి అరిచింది.

"కారు తాళాలు జేబులో వేసుకోండి ముందు. మనం ఇక్కడ ఆమెకోసం వెతుకుతుంటే ఆమె కారుదగ్గరకు చేరిందంటే ఇక ఆమెను పట్టుకోలేం!" మళ్ళీ కరుణాకరం అరిచాడు.

నీలకంఠం వెనక్కి వెళ్ళి కారు తాళాలు తెచ్చాడు.

"ఆమె పాడుబడ్డ షెడ్ దాకా వెళ్ళిందేమో చూశారా?"

"లేదు! ఆమె అంతదూరం పరుగెత్తలేదు. ఇంకా ఈ బీడులోనే ఎక్కడో వుండి వుంటుంది."

వాళ్ళు కరెక్ట్ గా ఊహించారు అనుకుంది సునీత. తను మరో వందగజాలు పరుగెత్తితేగాని పొదలదగ్గరకు చేరుకోలేదు. తూర్పు దిక్కునుంచి టార్చివెలుగు దగ్గరౌతోంది. అలాగే పడమర దిక్కునుంచి మరో టార్చ్ వెలుగు వస్తోంది. ఆ రెండూ బీడు మధ్యలో కలుసుకున్నయ్.

"దొరకలేదా? మనం ముగ్గురం వున్నాం! ఆమె ఒక్కదాన్ని పట్టుకోలేక పోతున్నాం!" నీలకంఠం విసుగ్గా అన్నాడు.

ఈ తడవ టార్చిలైట్ల వెలుగులు పొదలవేపుగా వెళ్ళుతున్నయ్.

ముగ్గురూ నాలుగు దిక్కులా వెతుకుతున్నారు. వాళ్ళ మధ్యలో గడ్డిలో పడుకుని వుంది సునీత. తను ఎటూ వెళ్ళటానికి వీల్లేకుండా అయిపోయింది.

"చీకట్లో కళ్ళు పెద్దవిచేసి చూడండి. చెవులు రిక్కించి వినండి! ఏ చిన్న శబ్దం వినిపించినా ఆలకించండి!" కరుణాకరం అరిచాడు.

ఇలా ఊరికే పడుకుంటే లాభంలేదు! తనను దొరక బుచ్చుకోకముందే తను ఏదో ఒకటి చేయాలి! ఏదో మెత్తగా ఆమె చేతికి తగిలింది. పామా? కప్పా లేక ఎలుకా? ఆమె కంగారుగా అరవబోయి తమాయించు కుంది. తన అదృష్టం బాగుండి అది కప్ప కాబట్టి బ్రతికి పోయింది.

తల కొద్దిగా పైకెత్తి చూసింది సునీత. ఎక్కడా టార్చిలైట్లు వెలగటంలేదు. వాళ్ళు లైట్లు ఆర్పేసి చీకట్లో తనకోసం నిరీక్షిస్తున్నారల్లే వుంది అనుకుంది.

వాళ్లెవరూ ఈ చీకట్లో తనకు కనుపించటంలేదు. అంటే వాళ్ళకూ తను కనుపించటం లేదన్నమాటే గదా! కనుక ఈ సమయంలోనే తను తప్పించుకోవాలి. ఎక్కడికి? తను ఈ మైదానంలో పరుగెత్తితే సునా యాసంగా పట్టుబడుతుంది. కనుక తనకు మళ్ళీ ఆ దయ్యాల మేడే శరణ్యం. వీళ్ళ కంటబడకుండా తను తిరిగి వెళ్ళి ఇంట్లోకి జొరబడితే ఏదో ఒక గదిలో దాక్కోవచ్చు. తనకోసం వాళ్ళు రాత్రంతా పొలాల వెంట వెదికి వెదికి చివరకు విసిగిపోయి, తమ అన్వేషణకు స్వస్తి చెబుతారు. తమకు దొరికిన డబ్బుని చేజిక్కించుకుని వాళ్ళ దోవన వాళ్ళు వెళ్ళిపోయాక తను ప్రాణాలతో బయటపడవచ్చు.

పైకి లేవకుండా, సునీత కాళ్ళూ చేతులమీదనే గడ్డి లోనే చిన్నపిల్లలా పాక్కుంటూ ఇంటివేపుగా మరలింది.

ఆమెకు రెండువేపులనించీ కరుణాకరం, కమలాదేవి, నీలకంఠం గొంతులు వినిపిస్తున్నయ్. అంతేకాదు. వాళ్ళు

క్రమేపీ దగ్గరౌతున్నట్టుగా వుంది. వాళ్ళు కలిసే చోటనే తను వున్నది. కనుక ఇరువైపులనుంచీ వాళ్ళు ఒకళ్ళ నొకళ్ళు కలుసుకునేలోగా తను ఇల్లు చేరుకోవాలి.

ఉష గొంతు వినిపించింది ఆమెకు. "నేను పూర్తిగా తడిసి ముద్దయిపోయాను. లోపలకు వెళ్ళి రెయిన్ కోటన్నా తెచ్చుకుంటాను."

"అఘోరించావులే! అలాంటి పనేం చేయకు. అరిచి గోలచేయక నోరుమూసుకుని వెతుకు!" నీలకంఠం గద్దించాడు.

వాళ్ళ గొంతుల్ని పట్టి, వాళ్ళు తనకు కనీసం యాభై, అరవయ్ గజాల దూరంలో వున్నారని గ్రహించింది సునీత.

అలాగే మరికొద్ది క్షణాలు ఆమె ప్రాకింది. అంతలోనే నేలమీద పడుతున్న టార్చిలైటు వెలుగు ఆమెకు చేరువగా వచ్చింది.

సునీత మ్రాన్పడిపోయింది. ఊపిరి బిగపట్టుకుని అక్కడే పడుకుంది నేలను కరుచుకుని బల్లిలా. ఎవరిదో కాలు వచ్చి ఆమె పడుకున్న చోటునుంచి గజం దూరంలో పడింది. తను దొరికిపోయానని ఆశవదలుకుంది సునీత.

అంతలోనే ఆ వ్యక్తి అరిచాడు. "టార్చిలైట్లు ఆర్పి వేయండి. ఏదో కారు వస్తున్నది రోడ్డమ్మటే. మనం ఇంత వానలో వెదకటం వాళ్ళకు అనుమానం కలిగించ వచ్చు" కరుణాకరం కంఠం అది.

సునీత తలత్రిప్పి చూసింది. రోడ్డుమీద దూరంనుంచి కారు హెడ్ లైట్ల వెలుగు కనబడుతోంది. తన ప్రక్కనే వచ్చి నిలబడ్డ వ్యక్తి అక్కడ్నుంచి కదిలి వెళ్ళిపోయాడు.

రోడ్డుమీద కారు వెళ్ళిపోయింది ఆ ఇంటిని దాటుకుని. తనచుట్టూ దగ్గరలో ఎవరూ లేరని నిర్ధారణ చేసుకుని

గబగబ నేలమీద ప్రాకి ఇంటి ఆవరణలోని లాన్‌లోకి చేరుకుంది సునీత.

మల్లెపొదల చాటుగా లేచి నిలబడింది ఆమె. పొలాల్లో ఇంకా వాళ్ళు వెదుకుతున్నట్టు నిదర్శనంగా టార్చిలైట్ల వెలుగు ఆమె కంటికి కనబడుతోంది.

మధ్యమధ్యలో ఉష తను తడిసి ముద్దయిపోతున్నానని అరవటం, నీలకంఠంగానీ, కరుణాకరంగానీ ఆమెను మందలించటమో వినబడుతోంది.

పోర్టికోలోని చెట్లచాటుగా నక్కుతూ ఆమె ఇంటి కేసి నడిచింది. పూలచెట్ల ముళ్ళు ఆమెకు గీసుకుని బాధని కలిగించినయ్. ఇంటి వెనుకగా వంట ఇంటి వాకిలి చేరు కుంది ఆమె.

తను తిరిగి తిరిగి మొదట బయలుదేరిన చోటికే చేరాల్సి వచ్చింది. వారగా వేసివున్న తలుపు చప్పుడు కాకుండా తెరుచుకుని లోపలకు దూరింది. తన వెనుకనే తలుపు మూసేసింది. ఇప్పుడు తనింకా ప్రమాదకరమైన చోటుకు చేరుకుంది. తను లైట్లు వెలుగుతున్న ఇంటిలో వుంది. వాళ్ళు చీకట్లో వున్నారు. అంటే వాళ్ళు యింటివంక చూశారో తన వునికి తెలిసిపోతుంది.

కనుక తను వెంటనే మేడమీదకు వెళ్ళి ఎక్కడో చోట దాక్కోవాలి.

9

సునీత చప్పుడు కాకుండా చెక్క మెట్లు ఎక్కింది. ఆమె కంటికి ఎదురుగా టెలిఫోన్ కనిపించింది.

మెరుపులా ఆమె మనసులో ఏదో ఆలోచన మెదిలింది.

రిసీవరెత్తి పోలీస్ స్టేషన్‌కి డయల్ చేసింది. సామా

న్యంగా ఫైర్ స్టేషన్ కీ పోలీస్ స్టేషన్ కీ ఊరూరా ఒకే నెంబరు వుంటుంది.

టెలిఫోన్ అవతలివైపు రింగ్ ఆగిపోయింది. ఎవరో రిసీవరెత్తారన్నమాట అనుకుంది.

"హలో! పోలీస్ స్టేషన్ ప్లీజ్!" అవతలి వైపునుంచి పలికారు.

"హలో సార్! నేను మద్రాసులో సేఠ్ రాజేశ్వర రావుగారి అమ్మాయిని సునీతను మాట్లాడుతున్నాను. మీరు త్వరగా రావాలి సార్! ఇక్కడ హత్య జరగబోతోంది" తడబడుతూ అంది సునీత.

"ఎక్కడనుంచి మీరు మాట్లాడేది? మీ ఫోన్ నెంబరెంత?"

"ఇక్కడంతా చీకటి సార్! ఫోన్ నెంబరు చూడాలంటే లైటు వేయాలి. లైటు వేశానంటే నేను వాళ్ళ చేతికి దొరికిపోతాను. నన్ను వాళ్ళు చంపేస్తారు!"

"నీకేం భయంలేదు. మేం ఇప్పుడే అక్కడికి చేరుకుంటాం. నీ అడ్రసన్నా చెప్పమ్మా!"

"రామాపురానికి రెండు మైళ్ళ ఇవతలే నిర్మానుష్యంగా రోడ్డు ప్రక్కనే ఏకాకిగా పాడుబడ్డ మేడ వుంది. అక్కడ్నుంచే నేను మాట్లాడుతూంట. మీరు త్వరగా రావాలి. నన్ను కాపాడేభారం మీదే!"

ఫోన్ పెట్టేసింది. ఎదురుగా ముసలమ్మగది వుంది. తలుపు నెట్టుకుని లోపలకు వెళ్ళింది. బహుశా గదిలో ముసలిదాని శవాన్ని చూడాల్సి వస్తుందేమో! అయినా కాసేపు తను ఎక్కడోక్కడ తలదాచుకోక తప్పదు.

గదిలోకి వెళ్ళి తలుపులు దగ్గరగా వేసింది. గడియ వేస్తే తనిక్కడే దాక్కున్నట్టు వాళ్ళకు యిట్టే తెలిసిపోతుంది.

వెనక్కి తిరిగిన సునీతకు ఖాళీబెడ్ కనిపించింది. అయితే రోగంతో తీసుకుంటున్న ముసలిది ఏమయినట్టు? ఆమెను హత్యచేసి ఆమె శవాన్ని అప్పుడే మాయం చేసేశారా?

వానలో బయటనుంచి వాళ్ళ మాటలు వినబడు తున్నాయ్. "మన కళ్ళల్లో కారంకొట్టి ఆమె రోడ్డెక్కి తప్పించుకు పోయిందేమో!" కమలాదేవి అడుగుతోంది.

"అసంభవం! ఆమె ఈ ప్రాంతాల్లోనే ఎక్కడో దాక్కొని వుంటుంది. వెదికి పట్టుకోండి!"

నీలకంఠం కారు స్టార్టుచేశాడు. కారు హెడ్ లైట్లు అన్ని వేపులా పడేట్టుగా కారుని ఇటూ అటూ నడిపాడు.

"ఎక్కడా వున్నట్టులేదు. ఒకవేళ ఆమె మళ్ళీ ఇంట్లోనే దూరిందేమో!" నీలకంఠం అరిచాడు.

"అయితే ఇబ్బందే వుండదు. కలుగులో దూరిన కుందేలుని పట్టేసినట్టు పట్టేయచ్చు!" కరుణాకరం సంతోషంలో అన్నాడు.

"కాని నేను అలా అనుకోను. ఆమె ఇక్కడే ఎక్కడో దాక్కొని వుంటుంది. మనందరం ఇంట్లోకి వెళ్ళిపోయాక యీజీగా తప్పించుకుని పారిపోవాలని ఆమె ప్లాను. ఆమె పథకం పారిందంటే మనందరూ మిగతా జీవితమంతా జైల్లో గడపాల్సిందే. అందుకే ఆమెకోసం వెదకండి. మనకథ బైటి ప్రపంచానికి తెలియజేయకుండా ఆమె నోటిని శాశ్వతంగా మూయించాలి" నీలకంఠం మళ్ళీ బదులు పలక్కాడు.

"అలా చీకట్లో మన గుట్టంతా అరిచి చెప్తావెందుకు? చీకటికి వెయ్యికళ్ళూ, చెవులూ వుంటాయ్!" కమలాదేవి వారించింది.

"ఇదిగో! మీ ఆడవాళ్ళిద్దరూ ఇంట్లోకి వెళ్ళి తలుపు

లన్నీ, కిటికీలన్నీ బంద్ చేయండి. మేమిద్దరం ఇక్కడ వెతుకుతాం!" కరుణాకరం నాయకుడిలా ఆజ్ఞలిచ్చాడు.

"అలాగే! రావే ఉషా! మనం లోపలకు పోదాం!" అంటూ కమలాదేవి తన కూతురితో ఇల్లు చేరుకుంది.

10

సునీత ఆశ్చర్యంగా మంచంక్రింద కూడా చూసింది, ముసలమ్మ శవాన్ని అక్కడేమైనా దాచారేమో అని. కాని అక్కడా ఏమీ కనుపించలేదు. ఆమె శవంకోసం వెదుకుతూ తను విలువైన కాలాన్ని పాడుచేస్తున్నానేమో అనుకుంది. తను దాక్కోవటానికి వీలైనచోటు ఏదైనా వున్నదేమో అని వెతికింది.

కాని ఆ గదిలో ఎక్కడా ఆమె దాక్కోవడానికి ఆస్కారం దొరకలేదు.

గది కిటికీ దగ్గరకు వచ్చింది. కిటికీ ప్రక్కగా ఏదో పూలచెట్టు తీగలు దట్టంగా అల్లుకుని పైకి ప్రాకుతున్నాయ్.

కిటికీలోంచి మెల్లగా, జాగ్రత్తగా, త్వరగా క్రిందకు జారింది సునీత. కిటికీ క్రిందుగా అడుగు వెడల్పున స్లాబ్ వుంది. ఆ చోటులో చెట్టుతీగల చాటున నక్కింది ఆమె. ఇక తనను బ్రహ్మదేవుడుగూడ కనిపెట్టలేడు. తను కిటికీలోంచి దిగినట్టుగా ఎవరూ కనుక్కోలేకుండా కిటికీ తలుపుల్ని నెమ్మదిగా మూసేసింది.

అన్నట్టు అరగంటలో యెటూ పోలీసులు రానేవస్తారు. అంతదాకా తాను వీళ్ళకంటబడకుండా కాపాడుకుంటే చాలు!

అన్నట్టు ఈ పోలీసులింకా రారేం అనుకుంది మళ్ళీ.

ప్రతి క్షణమూ ఒక యుగంలా ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకుని గడుపుతోంది.

పొలాల్లో వెదికి వెదికి వేసారి, చివరకు వాళ్ళిద్దరూ - నీలకంఠం, కరుణాకరం ఇంట్లోకి వచ్చేశారు.

"ఇల్లంతా గూడా వెదకండి ఒకసారి, ఎందుకయినా మంచిది" కరుణాకరం అన్నాడు.

ఆడవాళ్ళిద్దరూ క్రింద అంతటా, గదుల్లోనూ, వంట గదిలోనూ, బాత్ రూమ్, లావెట్రీల్లో గూడ వెదికి వచ్చారు.

నీలకంఠం మేడ మెట్లెక్కి ముసలమ్మ గదిలోకివచ్చాడు. గది అంతా కలయజూశాడు. బెడ్ క్రిందగూడ వెదికాడు.

చివరకు అక్కడ లేదని నిర్ధారణ చేసుకుని క్రిందకు దిగి వచ్చాడు.

"ఏమయివుంటుందబ్బా! మనందరం ఆమెను వెయ్యి కళ్ళతో కనిబెట్టే వున్నాంకదా?" నీలకంఠం ఆశ్చర్యంగా అన్నాడు.

"ఆమె యెక్కడ ఛస్తే మనకేం! ఆమె వెళ్ళి పోలీసుల్ని తీసుకరాకముందే మనం యిక్కడనుంచి వెళ్ళిపోవటం మంచిది" కమలాదేవి, కరుణాకరంవంక చూస్తూ అంది.

"ఇంట్లో లైటన్నీ ఆర్పేయండి! రోడ్డుమీద యేదో కారు వస్తున్నట్టుగావుంది. అర్ధరాత్రివేళ యిన్నిలైట్లు వెలగటంచూసి యెవరైనా అనుమానపడి యిక్కడకి రావచ్చు" కరుణాకరం రోడ్డుమీదకు చూస్తూ అన్నాడు.

మరుక్షణంలో క్రిందహాల్లో లైట్లు ఆరిపోయి డిమ్మార్ లు వెలుగుతున్నయ్.

వాన చాలవరకు తగ్గింది. గాలి నిలిచిపోయింది.

ఆ వచ్చేకారు పోలీసులదై వుంటుందా అని సునీత

సంబరపాటుతో ఆ లెట్లవంకే చూస్తోంది.

కాని అది పోలీసుకారు కాదు. ఆ యింటిని దాటుకుని వెళ్ళిపోయింది కారు. సునీతలోని వుత్సాహం చప్పబడి పోయింది.

ఇక తనకు ఆ భగవంతుడే దిక్కు! జీవితంలో ఎన్నడూ ప్రార్థించనంతగా ఆమె భగవంతుడ్ని ప్రార్థించుకుంది మనసులో. ముక్కోటి దేవతలనూ పేరు పేరునా తలుచుకుని మొక్కుకుంది ఈ ఆపదనుంచి రక్షించమని! త్వరగా పోలీసుల్ని పంపమని!

సునీత నిల్చున్న చోటునుంచి లాన్‌లో పార్క్ చేసిన కారు బాగా కనబడుతోంది.

హడావిడిగా తమ ముఖ్యమైన లగేజీని కారులో సర్దుతున్నారు అందరూ.

'హమ్మయ్య! వెళ్ళిపోతున్నారల్లే వుంది' అనుకుంది సునీత.

వాళ్ళు వెళ్ళిపోయినా తను పోలీసులు వచ్చేదాకా అక్కడే వుండటం మంచిది. ఎందుకంటే వాళ్ళు నిజంగా వెడుతున్నారో లేక తను దాక్కున్న చోటనుంచి బయటపడేలా మభ్యపెట్టటానికి యిలా ప్రయాణమౌతున్నట్టు నటిస్తున్నారో!

"ఇంతకీ క్యాష్‌బ్యాగ్ ఎవరిదగ్గరుంది?" అని అడిగాడు కరుణాకరం.

"నా దగ్గరుంది!" కారు వెనుకసీట్లో కూర్చున్న నీలకంఠం జవాబిచ్చాడు.

స్టీరింగ్ ముందు కూర్చుని కారు డోర్ వేసేశాడు కరుణాకరం. ఇంజన్ స్టార్ట్ అయింది.

'పీడా విరగడ అవుతున్నారు!' అని సంబరపడింది సునీత.

11

కారు లైట్లు వెలిగినయ్. కారుని బ్యాక్ చేస్తూండడంలో లైట్లకాంతి వచ్చి ఆమెమీద పడింది. చెట్లతీగదుబ్బులోంచి ఆమె చెయ్యీ, కాలూ బయటకు స్పష్టంగా కనబడుతున్నయ్ లైటు వెలుగులో.

సునీత తమాయించుకుంది. తను మొదటి అంతస్తు స్లాబ్ మీద నిల్చొనివుంది. లైటు వెలుతురు తనమీద పడినా వాళ్ళు తనను చూసివుండరు అనుకుంది.

కారు ఆగింది. తనను వాళ్ళు కని పెట్టారా కొంపదీసి! ఆమె గుండె దడదడా కొట్టుకుంది.

కారులోంచి కరుణాకరం దిగాడు. "ఒక్క నిముషం, ఇప్పుడే వస్తాను" అంటూ ఇంట్లోకి నడిచాడు.

సునీత అక్కడికక్కడే గడ్డకట్టుకుపోయింది. తనను పట్టుకోవటానికే కరుణాకరం వస్తున్నాడని గ్రహించింది. అయితే తనిప్పుడు నిస్సహాయురాలు. వెనక్కు పారిపోయేందుకు ఆస్కారంలేదు. వేటకాడు ఆ దారినే తరుముకొస్తున్నాడు. ముందరేమో పెద్దగొయ్యి. తను సాహసించి పై అంతస్తునించి దూకినా కాలో చెయ్యో విరగటం ఖాయం. పైగా కారులో కాచుకుని కూర్చున్న వ్యక్తులు వేటకుక్కల్లా తనమీద విరుచుకుపడతారు.

దభాలున కిటికీలోంచి తొంగిచూస్తూ "ఇక్కడ దాక్కున్నానా బుల్లీ!" అని వెటకరిస్తూ ఆమె చేయి పుచ్చుకున్నాడు.

"వదులు! నన్ను వదులు! లేదా ఒక్క గుంజు గుంజానంటే ఇద్దరం మేడమీదనుంచి క్రిందకు పడతాం!" సునీత బెదరింపుగా అంది.

ఆమె చేయిచుట్టూ కరుణాకరం చేయి ఇంకా బలంగా బిగుసుకుంది. బలంగా ఆమెను లాగి కిటికీలోంచి బొమ్మను

ఏ త్తినట్టుగా ఎత్తి లోపలకు దించాడు.

భయంతో పెద్దగా దిక్కులు మారుమోగేలా కేక పెట్టింది సునీత. తనకు అవే ఆఖరు క్షణాలు అనుకుంది.

"ఒరేయ్! మల్లిగా! ఆమె నోరు కాసేపు మూసెయ్. మళ్ళీ ఏదో కారు వస్తోంది రోడ్డంట!" క్రిందనుంచి నీల కంఠం అరిచాడు.

సునీత కరుణాకరం చేతిని గట్టిగా కొరికింది. బాధతో అతడు తనపట్టు వదిలేశాడు. విలుకాడు వదలిన బాణంలా ఆమె మేడమెట్ల మీదుగా క్రిందకు పరుగుతీసింది. కరుణా కరం ఆమె వెంటబడ్డాడు.

వాకిలి దాటుకుని సునీత యింట్లోంచి బయటకు పరు గెత్తింది పెద్దగా అరుస్తూ. కరుణాకరం రెండోదఫా ఆమెను దొరకబుచ్చుకున్నాడు. ఆమె క్రింద పడిపో యింది. ఆమె నోరు గట్టిగా మూశాడు తన చేత్తో అదిమి పట్టి. అతడికి సాయం చేద్దామని నీలకంఠంగూడ కారుదిగి వాళ్ళ దగ్గరకు వచ్చాడు.

సునీత జుట్టుపట్టుకుని ఆమెను అటూఇటూ ఊగించాడు నీలకంఠం. కరుణాకరం పట్టు ఆమె కంఠంచుట్టూ బిగుసు కుంటోంది.

సరిగా అదే సమయంలో ఆ ముగ్గురిమీద కారు హెడ్ లైట్ల కాంతి పడింది.

"ఎవరది? మీకు బుద్ధిలేదూ! లైట్లార్పేయండి" అని అరిచాడు కరుణాకరం.

కాని ఆ లైట్లు తమ కారువి కావనీ, మరో కారో, జీప్ విగాని అయివుంటవని గ్రహించి అతడు అవాక్కయి పోయాడు. "పోలీసులు!" అన్నాడు అప్రయత్నంగా.

12

సునీతను వదిలేసి నీలకంఠం, కరుణాకరం యిద్దరూ చెరో వేపు పారిపోయారు.

పోలీస్ జీప్ లోంచి పోలీసులు బిలబిలమంటూ నీలకంఠాన్ని చుట్టుముట్టారు.

కరుణాకరం వయసులో వున్నవాడు. వేగంగా పరుగెత్తసాగాడు పోలీసుల కందకుండా.

పోలీస్ యిన్స్పెక్టర్ రివాల్వర్ తీశాడు. ఇద్దరు పోలీసులు పారిపోతున్న కరుణాకరం మీదకు ఫ్లాష్ లైట్లు ఫోకస్ చేశారు.

ఇన్స్పెక్టర్ చేతిలోని రివాల్వర్ 'ఢాం!' అంది. కరుణాకరం కాలికి దెబ్బతగిలింది. అతడు బోర్లా పడిపోయాడు.

పోలీసులు వేటకుక్కల్లా అతడిమీద పడ్డారు.

సునీత అలాగే నేలమీద పడివుంది. ఎవరో ఆమె ముఖంమీద నీళ్ళు జల్లారు. ఆమె కళ్లు తెరిచింది.

"నడవగలవా అమ్మాయ్!" అంటూ యిన్స్పెక్టర్ చేయిచాచి ఆమెకు సాయంచేశాడు.

ఆమెను హాల్లో కుర్చీలో కూర్చోబెట్టారు. లైట్ల వెలుగులో తననుతాను చూసుకుంది సునీత. ఒళ్ళంతా, గుడ్డల నిండా బురద అయివుంది.

నీలకంఠం కుటుంబాన్ని పోలీసు కాపలాలో లోపలకు తెచ్చారు. ఉష మాత్రం పెద్దగా ఏడుస్తోంది, "నాకేమీ తెలియదు బాబోయ్! నేనే పాపమూ ఎరగను!" అని.

ప్లాస్కులోంచి వేడివేడి కాఫీ గ్లాసులో పోసి సునీతకి అందించారు.

"నీవేనా అమ్మాయ్ ఫోన్ చేసింది? నీ పేరేకదూ సునీత?" యిన్స్పెక్టర్ అడిగాడు,

"అవునండీ! నేనే మీకు ఫోన్ చేశాను. నా పేరే సునీత!"

"సార్జెంట్! వెంటనే వైర్‌లెస్‌లో హెడ్‌క్వార్టర్స్‌కి తెలియజేయి. సునీతాదేవి దొరికిందనీ, కులాసాగావుందనీ! రేణిగుంట కృష్ణా లాడ్జిలో ఆమె తండ్రిగారున్నారు. ఆయనకుకూడా ఈ విషయం తెలియజేయమను!"

"యస్ సార్!"

సునీత ఆశ్చర్యంగా చూసింది. "నేనెక్కడకూ పారిపోలేదండీ దొరకటానికి!" అంది ఆశ్చర్యంగా.

ఇన్‌స్పెక్టర్ నవ్వాడు. "ఓహో! నీవు వీళ్ళ అతిథిగా వున్నావన్నమాట ఈ మూడు రోజుల్నుంచీ!"

"అవునండీ! ఈ ఉషా, నేనూ పెన్ ఫ్రెండ్స్‌ము. ఆమెని చూడాలనీ, వాళ్ళింట్లో నాలుగు రోజులు గెస్ట్‌గా వుందామనీ ఇక్కడకు వచ్చాను. ఎయిర్‌పోర్టులో వీళ్ళు నలుగురూ నన్ను రిసీవ్ చేసుకుని, వాళ్ళ తాలూకు ముసలమ్మకు ప్రాణాలమీదకు వచ్చిందని చెప్పి ఇక్కడకు తెచ్చారు" సునీత ఆగి ఊపిరి పీల్చుకుంది.

ఇన్‌స్పెక్టర్ తననుచూసి నవ్వటం ఆమెకు చిరాకెత్తుతోంది. తనింత సీరియస్‌గా చెబుతూంటే అలా నవ్వుతాడేమిటి అనుకుంది.

"తర్వాత?" ఇన్‌స్పెక్టర్ అదే మూడ్‌లో అడిగాడు.

"వాళ్ళ ముసలమ్మ యాభైవేలు దాచిందని విన్నాను. ఆ డబ్బుకోసం ఆమెను సఫాచేసి ఆ డబ్బు దొరకబుచ్చుకున్నారు. ఈ రహస్యం నేను వెల్లడిస్తానేమో అని నన్నూ అంతంచేయాలని చూశారు. కాని నేను సమయానికి తప్పుకుని మీకు ఫోన్‌చేశాను. ఆఖరి క్షణాల్లో మీరు వచ్చి రక్షించారు. లేకపోతే నేను ఈ పాటికి యమధర్మరాజు ముందర వుండాల్సినదాన్ని!" సునీత వెక్కి వెక్కి

ఏడ్చింది.

"ఇదంతా బూటకం! వాళ్ళాడిన నాటకం! నిన్ను ఇక్కడ రహస్యంగా దాచి రేణిగుంటనుంచి మద్రాసులో వున్న మీ నాన్నకు ఫోన్ చేశారు! ఏమని? సునీత తమ చేతుల్లో వున్నదనీ, రెండు రోజుల్లో లక్షరూపాయలు తమ కందచేస్తే సరి, లేదా మీ అమ్మాయిని చంపి ఆమె శవాన్ని పార్సిల్ చేస్తామని!

"ఈ విషయం పోలీసులకు గూడ తెలియజేయరాదని గూడ భయపెట్టారు. నీకోసం మీ నాన్న లక్షరూపాయలు తెచ్చి కరుణాకరానికి అందజేశాడు. ఈ తెల్లవారుజాముననే నిన్ను తిరిగి అప్పగించాల్సి వుంది. అందుకే మీ నాన్నగారు రేణిగుంటలో హోటల్లో దిగి నీ గురించిన సమాచారంకోసం ఆదుర్దాగా కాచుకూర్చున్నారు!" ఇన్‌స్పెక్టర్ తన కథ ముగించాడు.

"ఏమిటీ? వీళ్ళు నన్ను కిడ్నాప్ చేశారా? మా నాన్న నుంచీ లక్షరూపాయలు గుంజారా? నేను నమ్మలేకుండా వున్నాను!" సునీత విస్తుబోయింది.

"అరుగో మీ నాన్నగారు! వారినే అడుగు!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"నా తల్లీ! కులాసాగా వున్నావా? ఈ రెండు రోజుల్నుంచీ ఎన్ని బాధలు పెట్టారో నిన్ను!" అంటూ సునీత తండ్రి వచ్చి ఆమెను వాటేసుకున్నాడు.

"అయితే ఈ ఉష ఆమె కుటుంబం యింత నీచులా?" కోపంగా ఉషవంక చూస్తూ అడిగింది సునీత.

"ఈమె ఉష కాదు. ఈమె అసలుపేరు సరస్వతి. కరుణాకరం పేరుతో చెలామణి అవుతున్న వ్యక్తి అసలు పేరు రాజారావు. నీలకంఠం పోర్షన్ వహిస్తున్న వాడి పేరు కనకయ్య. అతడి భార్య కమలాదేవి ఉరఫ్ నరసమ్మ.

"ఈ యిద్దరు దంపతులూ లోగడ ప్రజల్ని మోసంచేసి డబ్బు కాజేసిన నేరాలపై జైలుకెళ్ళి వచ్చినవాళ్ళే.

"సునీత కలం స్నేహితురాలు ఉష తండ్రికి బెంగుళూరు ట్రాన్స్ఫర్ అయి వెళ్ళిపోయాడు. బహుశా మీకావు త్తరం అందివుండదు. వాళ్ళు ఖాళీచేసిన యింట్లోకి కనకయ్య చేరాడు. సునీతనుంచి వచ్చే వుత్తరాలన్నీ చదివి రాజారావు సాయంకోరాడు. రాజారావు వెదికి వెదికి ఉష పోలికలు గల సరస్వతిని పట్టుకొచ్చాడు.

"ఎయిర్ పోర్ట్లో సునీతను రిసీవ్ చేసుకున్నారు. జబ్బుపడ్డ ముసలమ్మను చూడాలనే నెపంమీద ఆమెను ఈ పాడుబడిన బంగళాకు తెచ్చారు. అంతకుముందే దాన్ని బాగుచేయించి తమ కవసరమైన ఫర్నిచర్ని తెచ్చి పెట్టుకున్నారు.

"మేడమీద గదిలో ఖాళీ బెడ్ మీద టేప్ రికార్డర్ని వుంచి, ముసలిదాని అరుపుల్ని క్రిందకు వినపడేలా చేశారు. దాంతో సునీత నిజంగా ముసిలామె జబ్బులో వున్నదనే నమ్మింది.

"ఈలోగా రాజారావు, సునీత తండ్రికి ఫోన్ చేసి; సునీత తమ ఆధీనంలో వుందనీ_ వెంటనే లక్షరూపాయలు అందజేయకపోతే ఆమెను చంపి పార్సెల్ చేస్తామనీ చెప్పారు" అంటూ ఇన్స్పెక్టర్ వివరంగా చెప్పాడు.

అంతా విని సునీత కొయ్యబారిపోయింది.

—: ఐ పో యిం ది :—